## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : సిఐ మురళి



పండ్ల దుకాణంను తీయిస్తున్న సిఐ మురళి

గజ్వేల్ టౌన్, మే 7 (ప్రభాతవార్త): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో ఉదయం 10 గంటల నుండి రోడ్లపై నిలిపిన వాహనాలను, తోపుడుబండ్లను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై అడ్డదిడ్డంగా వాహనాలు, తోపుడుబండ్లు నిలపడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుందని, ఎవరైనా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా వాహనాలు నిలిపితే చలాన్ విధిస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా పోలీసులకు సహకరించాలన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## మల్లన్నసాగర్ ముంపు గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేశారా?

### -జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

**గజ్వేల్, మే 7 (ప్రభాతవార్త):** మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలపై బుధవారం ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరికి ఫోన్‌చేసి మాట్లాడారు. మల్లన్న సాగర్ నిర్వాసితుల కాలనీ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేశారా? గ్రామపంచాయతీలుగా కొనసాగిస్తున్నారా? అని జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. మల్లన్నసాగర్ పరిధిలోని గ్రామాలకు చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీని కలిసిన సందర్భంలో పై విధంగా అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే నోటిఫై చేశామని, మున్సిపాలిటీలో విలీనం కోసం ప్రభుత్వానికి ఫైల్ పంపినట్లు కలెక్టర్ పేర్కొన్నట్లు తెలిపారు. మల్లన్నసాగర్ ముంపు గ్రామాల్లో చెత్త సేకరణ ఇబ్బందిగా మారిందని, నాలుగు నెలల నుండి జీతభత్యాలు అందడంలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చెత్త సేకరణ ఇతర విషయాలకు మున్సిపల్ కమిషనర్‌కు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు కలెక్టర్ చెప్పారు. త్వరలోనే గజ్వేల్‌లో లోకల్ బాడీ జాయింట్ కలెక్టర్‌తో ప్రత్యేక మీటింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



ధాన్యం కొనుగోలు తీరును అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ మనుచౌదరి

## ధాన్యం రవాణాకు లారీల కొరత లేకుండా చూడాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ధాన్యం రవాణాకు లారీల కొరత రాకుండా పర్యవేక్షించాలని అర్బన్ తహసీల్దార్ సలీంను జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదని ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన అకస్మికంగా సందర్శించి ధాన్యం కొనుగోలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోళ్లు చేయడం జరుగుతుందన్నారు. అకాలవర్షంతో తడిసిన ధాన్యం కొనుగోలుచేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చి వరి ధాన్యాన్ని తేమ శాతం రాగానే తూకం వేసి మిల్లులకు పంపాలన్నారు. రైతులకు డబ్బుల త్వరగాఅందేలా చూడాలన్నారు.

## కలెక్టర్ హామీతో తెరుచుకున్న తహసీల్దార్ కార్యాలయం



అద్దె చెల్లిస్తామని కలెక్టర్ హామితో తెరుచుకున్న తహసీల్దార్ కార్యాలయం దృశ్యం

**కంగ్టి, మే 7, ప్రభాతవార్త:** రెండేళ్లుగా అద్దె చెల్లించడం లేదని ఆగ్రహించిన ఇంటి యజమాని మంగళవారం ఇంటికి తాళం వేసుకోవడంతో కార్యాలయంలో కార్యక్రమాలకు బ్రేక్ పండింది. తహసీల్దార్ కార్యాలయానికి యజమాని తాళం వేసినట్లు తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి కుమారి ఇంటి యజమాని నర్సమ్మకు పెండితో ఉన్న ఇంటి అద్దె బిల్లులను త్వరలోనే చెల్లిస్తామని భరోసా కల్పించడంతో యజమాని నర్సమ్మ తాళాలు తీసి కార్యాయలంలో అధికారులు పనులు చేసుకునేలా చేశారని డిప్యూటీ తహసీల్దార్ హేమంత్ వివరించారు.

## వైభవంగా వాసవీమాత జయంతి ఉత్సవాలు



కన్యకా పరమేశ్వరీ పటాన్ని బహూకరిస్తున్న హరీష్‌రావు

**సిద్దిపేట అర్బన్, మే 7, ప్రభాతవార్త :** సిద్దిపేటలోని ఆర్యవైశ్య భవన్ వాసవి అమ్మవారి కుంకుమార్చన కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పతాకావిష్కరణ చేసి 102 కలిశాలతో అభిషేకం చేశారు. సామూహిక కుంకుమార్చనలు, అగ్నిప్రతిష్ఠ, గణపతి గౌరీ స్థాపిత దేవత హవనం, మూలమంత్ర ఆహ్వానం బలి ప్రధానం పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య అధ్యక్షులు అయిత బాలరాజేశ, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఆర్యవైశ్య మహిళలకు నూట రెండు గోత్రాలతో ఉన్నటువంటి వాసవి మాత కన్యకాపరమేశ్వరీ పటాన్ని అందించారు.

## ప్రతి రైతు ఫార్మర్ రిజిస్టీ చేసుకోవాలి

### కొల్చారం వ్యవసాయాధికారి శ్వేత

**కొల్చారం, మే 7, ప్రభాతవార్త:** ప్రతి రైతు ఫార్మర్ రిజిస్టి చేసుకోవాలని, ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లే ప్రతి రైతుకు 11 నెంబర్లతో విశిష్ట సంఖ్య (యూనికోడ్) ని కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టును చేపట్టడం జరుగుతుంది కొల్చారం మండల వ్యవసాయ అధికారిణి శ్వేతా కుమారి అన్నారు బుధవారం రోజు కొల్చారం మండల పరిధిలోని ఎనగండ్ల, సంగయిపేట, పైతర, తుక్కపూర్, కొంగోడు గ్రామాల్లో ఫార్మర్ రిజిస్టీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి తెలిపారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతు తనకు ఉన్న భూములకు సంబంధించిన వివరములతో కూడిన సమాచారంతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ నిర్మించబడుతుంది. రెవెన్యూశాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలను రైతు యొక్క ఆధార్ సంఖ్యను అనుసంధానం చేయడం ద్వారా ఈ ఫార్మర్ ఐడి ని కేటాయించడం జరుగుతుంది. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు ఏ రకమైన చట్టబద్ధ యాజమాన్య హక్కును కల్పించదు. కేవలం రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భూ యాజమాన్య వివరాలను ప్రామాణికంగా తీసుకొని ఈ రైతులకు ఫార్మర్ ఐడి కేటాయించడం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనుసంధానం చేయడం జరుగుతుంది. పిఎం కిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడత లబ్ధి పొందటానికి ప్రామాణికంగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వ సంబంధించిన పథకాలు అయిన రైతు భరోసా రుణమాఫీ తదితర రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీకి ఏ రకమైన సంబంధం లేదు. రైతు విశిష్ట సంఖ్యను(ఫార్మర్ఐడి) పొందుటకు ఆధార్, భూ యాజమాన్య పాస్ పుస్తకము ఆధార్ కు లింక్ చేయబడిన మొబైల్ నెంబరు తీసుకొని సమీపంలోని వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఫార్మర్ ఐడీకి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ కార్యక్రమం మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అంబిక తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రభుత్వ పథకాలు జిల్లా ప్రజలకు సమర్థవంతంగా అందేలా ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధతో కలిసి అకాల వర్షాల వల్ల పంట నష్టం, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక, తాగునీటి, విద్యుత్ సమస్యపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సామాన్య వ్యక్తులకు, ప్రతి పేదవారికి అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగాచేపట్టిన ఉచిత సన్న బియ్యం సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ కిరణంతదితర పథకాలను పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లను గూడు లేని నిరుపేదలకు కేటాయించేలా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులకు డబ్బులు త్వరగా చెల్లించాలన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చర్యలు చేపట్టిందని నష్టం వివరాలను త్వరగా ప్రభుత్వానికి అందించాలన్నారు. నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా నిఘా పెట్టాలన్నారు. జిల్లాలో అయిల్‌ఫామ్ తోటలను పెంచేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. పిఆర్, ఆర్అండ్‌బి శాఖలలో పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. టెన్త్, ఇంటర్‌లో 90 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించేందుకే వేదిక సిద్ధం చేయాలన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు అబ్దుల్ హమీద్, గరిమా అగర్వాల్, వివిధశాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

### ధరణి తెచ్చిన పంచాయతీలను భూభారతితో పరిష్కరిస్తున్నాం

**అక్కన్నపేట, మే 7, ప్రభాతవార్త**

గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ధరణి చట్టం తీసుకొచ్చిన భూ పంచాయితీలను భూ భారతి చట్టంతో పరిష్కరిస్తున్నామని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం భూ భారతి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన నేపధ్యంలో మండలంలోని జనగామ గ్రామంలో జరుగుతున్న రెవేన్యూ అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ గత బిఆర్ఎస్ హయాంలో తీసుకొచ్చిన ధరణి చట్టంలో భూ సమస్యలు పెరిగాయని భూమి అంటే ప్రజల ఆత్మ గౌరవం అని తాతల నుండి వస్తున్న భూమి మనదే అయినప్పటికీ సమస్యలు ఏర్పడి యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి సమస్యలను తొలగిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నూతన చట్టం తీసుకొచ్చి పరిష్కరిస్తున్నామన్నారు. జనగామా గ్రామంలో 140 మంది భూ సమస్యలు ఎదుర్కొంటున్నారని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే వంద మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇక అక్కన్నపేట మండలంలో నీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని హనుమాన్ స్వాములు తమకు బోరు కావాలని కోరగా వారికి బోరు వేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూభారతి చట్టం ద్వార భవిష్యత్తులో భూముల సమస్యలు ఉండవన్నారు.

మంగళవారం రాత్రి భారత ప్రభుత్వం ఉగ్రవాదుల మీద చేసిన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఉగ్రవాదులు మన దేశం వైపు చూస్తే గుడ్లు పీకేస్తామని హెచ్చరికలు జారీ చేసినట్లు చెప్పారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన సైనికులకు మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మెన్ కంది తిరుపతిరెడ్డి, ఆర్డీవో రాం మూర్తితోపాటు తహసీల్ధార్ అనంతరెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఉచితంగా సరఫరా

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**మెదక్ అర్బన్, మే 7, ప్రభాతవార్త:**

ఇందిరమ్మ గృహాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేసే విషయంలో స్థానిక వనరులను గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారుల ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయ వీడియో సమావేశ హాల్‌లో ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక సరఫరా చేయడంపై జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం హౌసింగ్, మైనింగ్, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ముందుకు పోవాలన్నారు. జిల్లాలో 1 లక్ష 74 వేల క్యూబిక్ మీటర్లు ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక అవసరం ఉంటుందని స్థానిక వనరుల ద్వారా ఇసుక సరఫరాకు గ్రౌండ్ వాటర్, రెవెన్యూ మైన్స్ శాఖల సమన్వయం ద్వారా జాయింట్ సర్వే నిర్వహించాలన్నారు. ఇసుక రీచ్‌లు మన జిల్లాలో లేనందున స్థానిక వనరుల స్ట్రీమ్స్ నుండి గుర్తించి లబ్ధిదారుని ఇంటి దగ్గరే ఇసుక సరఫరా చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంజీరా నది ఇసుక గురించి ఇరిగేషన్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. తాసిల్దార్ లందరూ జీవో



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

ఎంఎస్ నెంబర్ 03 ప్రభుత్వ నిబంధనలను చదవాలన్నారు. స్థానిక వనరుల ద్వారా ఇసుక సరఫరా చేసే విషయంలో తాసిల్దార్లు, ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు ఎన్ని క్యూబిక్ మీటర్లు అవసరం ఉంటుందో దాని వరకే అనుమతి మంజూరు చేయాలన్నారు, ఇసుక లోడింగ్ అన్లోడింగ్ రవాణా చార్జీలు విషయంలో ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలన్నారు. వర్షాకాలం రాకముందే ఇందిరమ్మ ఇండ్లు వాల్స్ వరకు పూర్తి అవ్వాలని చెప్పారు. అనంతరం నూతన గ్రామపంచాయతీలు సెగ్రిగేషన్ షేడ్స్ న్యూ గ్రామపంచాయతీ బిల్డింగ్స్ భూమిని గుర్తించే విషయంలో తాసిల్దార్లు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. సెగ్రికేషన్ షేడ్స్ గుర్తించేటప్పుడు నిబంధనలు పాటిస్తూ దారి తప్పనిసరిగా ఉండాలని 05,06 గుంటల భూమి అవసరం ఉంటుందన్నారు.

జూన్ 2 నుండి జిల్లాలో ప్రతి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహణపై ఆర్డీవోలకు తహసీల్దార్లకు కలెక్టర్ పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి అదనపు కలెక్టర్ భుజంగరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం, ఆర్డీవోలు, మెదక్ రమాదేవి, తూఫ్రాన్ జై చంద్రారెడ్డి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, మైనింగ్ అసిస్టెంట్ జువాలజిస్ట్ మధుకుమార్, ఆర్ఐ లక్ష్మీ నారాయణ, సంబంధిత తహసీల్దారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

### జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కర్

**సంగారెడ్డి బ్యూరో మే 7, ప్రభాతవార్త :**

ప్రజలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందటమే లక్ష్యమని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కర్ అన్నారు. బుధవారం సురేష్‌షెట్కర్ అధ్యక్షతన జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించేందుకు జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి సహ అధ్యక్షులుగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ముఖ్య అతిథులుగా, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమురయ్య, టీజీఐఐ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై ఈ సమావేశంలో సమీక్షించారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమం, విద్యా, ఆరోగ్య రంగాల్లో జరుగుతున్న పనులపై చర్చ జరిగింది.

ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న 165 నేషనల్ హైవే పనులు వెంటనే పూర్తి చేసేలా నేషనల్ హైవే అథారిటీస్ అధికారులు కన్సల్టెంట్లు, కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని వచ్చే సమావేశానికి నేషనల్ హైవే అధికారులు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని పటాన్చెరువు జహీరాబాద్ నేషనల్ హైవేలో మల్కాపూర్ వద్ద, నాందేడ్ అకోలా రహదారిలో సుల్తాన్పూర్ వద్ద అసంపూర్తిగా ఉన్న పనులు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో విద్య, వైద్య, గృహ, ఆరోగ్య శాఖల అధికారులను జిల్లాలో జరుగుతున్న ఆయా శాఖల పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పటాన్చెరువు నియోజకవర్గ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో నూతనంగా నిర్మించడం కోసం ఉన్న భవనాన్ని కూల్చివేశారని భవన నిర్మాణం పనులు చేపట్టకపోవడంతో విద్యార్థులు చెట్ల




మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షట్కార్

కింద చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది అన్నారు పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో చెరువులు కుంటలలో మత్స్యశాఖ ద్వారా చేపల పెంపకానికి అవసరమైన చేప పిల్లల్ని జిల్లాలోని ఉత్పత్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో రోడ్లు భవనాల నిర్మాణంలో గల ఆలస్యానికి కారణాలు అడిగారు. వైద్య ఆరోగ్యం విషయంలో ఎలాంటి విధానాల అవలంబిస్తున్న ప్రజల కావలసిన అవసరాలను వివరించారు. జిల్లాలో గల క్రీడా మైదానాల పనితీరును క్రీడా అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్రీడా పథకాల అమలులో పారదర్శకత, సమర్థత, వేగం పెంచాలని ఎంపి సురేష్‌షెట్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రజల అభివృద్ధే లక్ష్యంగా. ప్రభుత్వం ఖర్చు చేస్తున్న ప్రతి రూపాయి ప్రజలకు అందెల చూడాల్సినబాధ్యత అధికారులకు ఉందన్నారు. జిల్లాలో వ్యవసాయ, సంక్షేమ, గ్రామీణ శాఖలో గల పనులు ఏ విధంగా కొనసాగుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయంలో జిల్లాకు కావలసిన అవసరాలను వివరించారు. దేశాభివృద్ధిలో గ్రామాలు ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో గ్రామాలకు కలిపే లింక్ రోడ్డు పనులు చేపట్టాలని సూచించారు. ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నాయని తెలిపారు.

టీజీఐఐ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రజలకు ఏ అవసరాలు ఉన్న ప్రభుత్వాలు తీరుస్తున్నట్లు ఆమె వివరించారు. సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకే చేరాలని అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ నాయకులు అధికారుల సమన్వయంతో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు తక్షణం అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, పిడి డిఆర్‌డిఏ జ్యోతి, దిశ కమిటీ సభ్యులు జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. పెహలిగాం ఉగ్రవాద దాడుల్లో మృతి చెందిన వారికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు



శ్రీరేణక ఎల్లమ్మకు పూజలు నిర్వహిస్తున్న హరీష్‌రావు

## శ్రీరేణుక ఎల్లమ్మకు ఎమ్మెల్యే హరీష్‌రావు పూజలు

**సిద్దిపేట రూరల్/సిద్దిపేట అర్బన్, మే 7, ప్రభాతవార్త :**

సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాంపూర్‌లో శ్రీరేణుకన ఎల్లమ్మ దేవాలయ ఉత్సవాలలో పాల్గొన్నారు. నారాయణరావుపేట మండల గుర్రాలగొంది గ్రామంలో శ్రీ అభయ అంజనేయ స్వామి దేవాలయం అన్నదాన భవనాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే చిన్నకోడూరు మండలం మాచాపూర్‌లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం ఉత్సవాలలో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలోని వైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి జయంతి వేడుకలో హరీష్‌రావు పాల్గొన్నారు. వాసవి మాత ఫోటో అవిష్కరించి 2 వేల వైశ్య కుటుంబాలకు అమ్మవారి ఫోటోలను అందజేశారు. ఆయన వెంట బిఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు. అనంతరం సిద్దిపేట పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 195 మంది లబ్దిదారులకు రూ.43 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

**భారత సైన్యానికి హనుమంతుడు ఆత్మసైర్యం, బలం ఇవ్వాలి...**

భారత సైన్యానికి హనుమంతుడు ఆత్మసైర్యం, బలం ఇవ్వాలని హరీష్‌రావు అన్నారు. అమాయకులైన టూరిస్టుల మీద క్రూరంగా దాడి చేసి పాకిస్తాన్ ప్రేరేపిత టెర్రరిస్టులకు ధీటుగా భారత దేశం పాకిస్తాన్ ప్రేరేపిత టెర్రరిస్టుల మీద దాడి చేసి గట్టి గుణపాఠం చెప్పిందన్నారు. భారతీయులంతా ఒక్క తాటిపై ఉండాలని..యావత్ భారత జాతి భారత సైనికుల పక్షాన అండగా నిలిచి మద్దతు ఇవ్వాలన్నారు. భారత సైనికులకు సలాం అంటూ భారత్ మాతాకీ జై కొట్టారు.

## మలుపుల్లో ప్రమాదపు పిలుపులు

### ఆదమరిస్తే ప్రమాదమే

**చిన్నశంకరంపేట, మే 7, ప్రభాతవార్త:** తెల్లవారు లేచింది మొదలు వివిధ గ్రామాల నుండి ప్రజలు పనుల నిమిత్తం చిన్నశంకరంపేట పట్టణానికి, లేదా జిల్లాకేంద్రం మెదక్‌కు వెళ్తుంటారు. గ్రామ శివారులో మలుపులు ఉండటం వల్ల వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మెదక్ నుండి చిన్నశంకరంపేట మిదుగా వాహనదారులు భాగ్యనగరానికి వెళ్తుంటారు. మలుపులు ఉన్న అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. మూల మలుపుల వద్ద పోదలు, చెట్లు, చెట్ల కొమ్మలు ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనం కనపడక వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోంటున్నారు. సంబధిత అధికారులు, గ్రామాధికారులు స్పందించి మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే మలుపుల వద్ద ఉన్న చెట్ల కొమ్మలను,పోదలను గుర్తించి వాటిని తిసివేయాలని కోరుతున్నారు.



ఖాజాపూర్-పాతూర్ రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న చిన్నజీయర్‌స్వామి

## వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలు

### పాల్గొన్న చిన్నజీయర్‌స్వామి, ఈటల రాజేందర్

**మర్కుక్, మే 7 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని వరదరాజపూర్ గ్రామంలో జరుగుతున్న భూనీల సమేత వరదరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో బుధవారం త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన యంత్ర స్థాపన మహోత్సవంలో వారు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం చిన్న జీయర్‌స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ముందుగా చిన్న జీయర్‌స్వామి, ఈటల రాజేందర్‌లు ఆలయానికి చేరు కోగా ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారిని సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రవీణ్, బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ముదిరాజ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సింగం సత్తయ్య, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి, బిజెపి నాయకులు అంతని సురేష్, వల్లపు సత్యం, అంతని గణేష్, మీసాల జాను, కొండల్, సంజీవరెడ్డి, శంకర్‌రెడ్డి, లక్కాకుల నరేష్, బుద్ద మహేందర్, బిజెపి నాయకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఈటల రాజేందర్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

## సామాజిక విప్లవాన్ని సాధించిన మహనీయుడు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి : రవీంద్రాచారి



వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలలో పాల్గొన్న టీడీపీ నేతలు

**ముషీరాబాద్, మే 7, ప్రభాతవార్త:** తన రచనల ద్వారా సామాజిక విప్లవాన్ని సాధించిన మహనీయుడు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అని తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దోజు రవీంద్రాచారి కొనియాడారు. బుధవారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలలో భాగంగా ట్యాంక్‌బండ్‌పై ఆట్లూరి రవీంద్రాచారి, కరుణశ్రీల ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలకు ఆయన హాజరయ్యారై మాట్లాడుతూ వీర బ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞాన కర్త, దార్శనికుని, మహాతత్వవేత్తగా, ఒక యోగిగా, సంఘసంస్కర్తగా, అజ్ఞానంలో మగ్గిపోతున్న మానవాళికి జ్ఞానోదయాన్ని కల్గించటానికి వచ్చిన అవతార పురుషుడని కొనియాడారు. ఆనాడు ఆయన చెప్పిన కాలజ్ఞాన వాక్యాలు వేద వాక్కులుగా నిరూపితమవుతూ, నేటికీ నిజమవుతున్నాయని గుర్తు చేశారు. ఈనాడు దేశంలో ఉన్న యుద్ధ వాతావరణం గురించి కూడా ఆయన ఆనాడే బోధనలలో తెలియచేశారని అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ప్రవీణ్‌లు వీర బ్రహ్మేంద్రస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ వేడుకలో ఎస్. ప్రకాష్, మేడ్చల్ సత్యనారాయణ, తిరుమూర్తుల గౌరీ శంకర్, వంకోజు మాధవాచారి, కొల్లూరి శ్రీనివాసాచారి, మహారాజు రవీంద్రాచారి, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీఉజ్జయిని మహంకాళి అమ్మ వారి ఆలయంలో టెండర్ల కేటాయింపు

**బేగంపేట మే 7,ప్రభాతవార్త**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయిని మహంకాళి అమ్మ వారి ఆలయంలో 2025 ఆషాఢ బోనాల పండుగ కు సంబంధించి వివిధ పనులకు టెండర్లు కేటాయించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి, అసిస్టెంట్ కమిషనర్ గుత్తా మనోహర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేసారు. వీటిలో విద్యుత్ దీపాలంకరణ,పూల డెకరేషన్, కలశాల డెకరేషన్,క్యూలైన్,వీడియో,ఫోటోగ్రఫీ,రంగులు వేయడానికి సంబంధించిన టెండర్లతో పాటు 2024 2025సంవత్సరంలో సేకరించిన చీరలు,బ్లౌజు పీసులు (ఎట్ల పున్నవి అట్లనే) సుమారు 20వేల చీరలు అమ్మకునే హక్కుకు టెండర్లు నిర్వహించామన్నారు.ఈ టెండర్లలో విద్యుత్ దీపాలంకరణ కు ఆజయ్‌కుమార్ తక్కువ టెండర్ రూ 9,70,000లు,పూల డెకరేషన్ య.రవీందర్ రూ 14,78,270లు,రంగులు వేయడానికి ఎస్.ప్రభాకర్ రూ 15,00,000లకు టెండర్లు కేటాయించినట్లు ఈ వ టెండర్ల కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి మదు,ఇన్స్‌పెక్టర్ దేవాదాయశాఖ,సికింద్రాబాద్,ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్లు పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం



రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న డా. కె. శైలజ

**దుండిగల్, మే 7, ప్రభాతవార్త**

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం వారి ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలము, దుండిగల్ గ్రామంలో బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్ నుండి విచ్చేసినటువంటి డా. కె. శైలజ రైతులను ఉద్దేశించి వ్యవసాయాలు సాంకేతిక పద్ధతులు, ఆధునిక పద్ధతులు, యాజమాన్య పద్ధతులను వివరించడం జరిగింది. దీనిలో భాగంగా ఎరువుల యాజమాన్యం, భూసార పరీక్ష ఆవశ్యకత, మట్టి నమూనా సేకరణ పద్ధతి, వరిలో నీటి యాజమాన్యంపై వివరించడం జరిగింది. కాకుండ వరిలో యాంత్రీకరణ పద్ధతులు డ్రిప్ సీడర్ విధానం, రైతు ఉత్పత్తిదారుల సంఘాల గురించి తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి ఎస్. యదగిరి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వి.ఆర్.ఎ. రాజు, (పిఏసిఎస్) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కె. శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ ఎ. గోపాల్ రెడ్డి, ప్రగతి శీల రైతులు ఎన్. సదానందరెడ్డి సి. హెచ్ అశోక్, టి. రాజ్ కుమార్, జి. పాండురంగాచార్, బి. నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడిగా సందీప్ ముదిరాజ్

**అత్తాపూర్ మే 7,ప్రభాతవార్త :**

రాజేంద్రనగర్ డివిజన్ నూతన బీజేపీ అధ్యక్షుడిగా పసుపుల సందీప్ ముదిరాజ్ నియమిస్తూ రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పసుపుల సందీప్ ముదిరాజ్ అధ్యక్షుడు మాట్లాడుతూ.... తనపై నమ్మకం ఉంచి డివిజన్ అధ్యక్షుడిగా నియమించిన జిల్లా పార్టీ అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్, రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పై శ్రీధర్, బొక్కా బాల్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, జిల్లా కార్యదర్శి కొమురయ్య, కె హరి కిషన్ జీ ,నోల్లార్ రెడ్డి లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. డివిజన్లో బిజెపి పార్టీ అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తానన్నారు. గతములో రాజేంద్రనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి గా పనిచేసిన అనుభవం ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, కేంద్ర ప్రభుత్వ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చైతన్యం చేస్తూ పార్టీ అభివృద్ధి కొరకు కృషి చేస్తున్నానని రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో బిజెపి పార్టీ గెలుపు లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

## మంత్రి సీతక్కని కలిసిన సుదర్శన్ రెడ్డి

**పేట్ బషీరాబాద్, మే 7, ప్రభాతవార్త**

తెలంగాణ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను బుధవారం టిపిసిసి లేబర్ సెల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కాండాడి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో లేబర్ సెల్ నాయకులు నర్సిరెడ్డి భాస్కర్, కర్నల ఉపేందర్ గౌడ్ లు, కావలి గోపాల్ ముదిరాజ్, మండల సంపత్ కుమార్ గౌడ్లు కలిశారు. ఈ సందర్భంగా కార్మికులందరికీ తప్పనిసరిగా టిపిసిసి లేబర్ సెల్ పాటు వెల్ఫేర్ కార్డు ఉండేల చర్యలు తీసుకోవాలని టిపిసిసి లేబర్ సెల్, ఐఎన్టియుసి తరఫున వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కార్మికుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా కార్మిక చట్టంలో మార్పు తీసుకొచ్చి భవన నిర్మాణ, ఇతర నిర్మాణ యజమానులకు, డెవలపర్స్, కాంట్రాక్టర్స్, బిల్డర్స్‌కు సంబంధిత శాఖల ద్వారా ప్రత్యేక షరతులు విధించి అర్హులైన ప్రతి ఇళ్ల గృహ నిర్మాణ కార్మికుడికి తప్పనిసరిగా బిఓసిడబ్ల్యూ వెల్ఫేర్ కార్డు ఉండేలా చూస్తే కార్మికులకు వారి కుటుంబాలకి మేలు ద్వారా ప్రభుత్వం ద్వారా మేలు జరుగుతుందని కోరారు. అలాగే రాష్ట్రంలో ప్రతి ఎంఆర్ఓ కార్యాలయంలో కార్మిక శాఖ ద్వారా ప్రత్యేక కౌంటర్లు పెట్టి కార్మికులకు లబ్ధి చేయాలని అభ్యర్థించారు. దీనికి మంత్రి సీతక్క స్పందించి ప్రిన్సిపాల్ సెక్రెటరీ కార్మిక ఉపాధి శిక్షణ కర్మాగారాల శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ ఎం. దానకిశోర్‌తో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## అపురూప కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**జీడిమెట్ల, మే 7, ప్రభాతవార్త**

130 సుభాష్ నగర్ డివిజన్ అపురూప కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అపురూప కమ్యూనిటీ హాల్‌ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ అందుబాటులో అపురూప కాలనీ వాసులతోపాటు సమీప కాలనీవాసులు వారి ఇళ్లలో నిర్వహించుకునే శుభకార్యాలు, పండుగలు, సాంస్కృతిక కార్యకలాపాలకు "అపురూప కమ్యూనిటీ హాల్" చక్కటి వేదిక అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, శేషాచారి, దుర్గారావు, పి ఎస్ ఎన్ రాజు, వల్లభనేని రమణ, పందిరి యాదగిరి, అపురూ ప కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తిప్పారెడ్డి, ఉపాధ్యక్షులు రామకృష్ణారావు, సెక్రటరీ



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

వివి రమణ, జాయింట్ సెక్రటరీ కిష్టారెడ్డి, కోశాధికారి సత్యనారా యణ, సభ్యులు సురేందర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, సీతా రామ, హనుమంతరావు, అంజయ్య, ఎస్.కె.షఫీ బాబు తదితరులు పాల్గొన్నారు.

### మన్యం దొర అల్లూరి వర్ధంతి వేడుకలు

130 సుభాష్ నగర్ డివిజన్ అపురూప కాలనీ చౌరస్తాలో నిర్వహించిన మన్యం దొర అల్లూరి వర్ధంతి కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

## ప్రజల సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాం

**- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్**

**నార్సింగి, మే 7 ప్రభాతవార్త :** ప్రజల సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం గండిపేట మేయిన్ రోడ్డు విస్తరణ, ట్రాఫిక్ సమస్యలు అలాగే కోకాపేట్ నాలా విస్తరణ వంటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నార్సింగి మున్సిపల్ పరిధిలోని ఆల్ గేటెడ్ కమ్యూనిటీ అసోసియేసన్ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను, నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్‌రెడ్డిలను కలిశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజలు ఏ ఇబ్బందులున్నా నేరుగా నన్ను సంప్రదించాలని, వీలైనంత త్వరగా సంబంధిత అధికారులతో మాట్లాడి మీ ఇబ్బందులు దూరం చేస్తానని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతోనే నాలుగోమారు ఎమ్మెల్యేగా గెలుపొందానని, వారిచ్చిన అధికారంతో వారి సమస్యలను పరిష్కరిస్తున్నాని తెలిపారు. ప్రజాసేవలో కలిగే సంతృప్తి అనంతమైందన్నారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గండిపేట మేయిన్ రోడ్డు, కోకాపేట్ నాలా సమస్యలను పరిష్కరించాలని ఆల్ గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ అధ్యక్షులు



గండిపేట మేయిన్ రోడ్డు, కోకాపేట్ నాలా సమస్యలపై ఎమ్మెల్యేను కలిసిన ఆల్ గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ సభ్యుల దృశ్యం

ఎమ్మెల్యేను కలిసి కోరారని తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సానుకూలంగా స్పందించి, వీలైనంత త్వరగా మీ సమస్యలు పరిష్కరిస్తామని హామీనివ్వడం మమ్ములను సంతోషానికి గురి చేసిందన్నారు. ప్రజల సమస్యలపై వేగంగా స్పందించే గుణమే వరుసగా నాలుగుమార్లు ప్రకాశ్‌గౌడ్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గేటెడ్ కమ్యూనిటీల అధ్యక్షులు సురేష్‌చంద్ర, శేఖర్‌గౌడ్, నీలేష్ దూబే, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, మాజీ సర్పంచ్ రామేశ్వరం నర్సిహ్మా, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, కిరణ్, వసంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్ విజయంపై బిజెపి శ్రేణుల సంబురాలు..

**బేగంపేట మే 7,ప్రభాతవార్త**

పెహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా ఆపరేషన్ సింధూ పేరిట భారత సైన్యం చేసిన వైమానిక దాడులు విజయ వంతం కావడంతో మహంకాళీ జిల్లా బీజేపీ అధ్యక్షులు భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్యాట్నీ సెంటర్‌లో సంబురాలు నిర్వహించారు. ముందుగా టపాకాయలు పేల్చి,స్వీట్లు పంచుకుని సంతోషాన్ని తెలియజేసారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పారని మహంకాళీ జిల్లా బీజేపీ అధ్యక్షులు గుండగోని భరత్‌గౌడ్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ చెప్పిన మాట ప్రకారమే పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడులు చేయడం ఉగ్ర వాదాన్ని అణచివేసే విధంగా చర్యలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. భవిష్యత్‌లో భారత్ వైపు కన్నెత్తి చూడాలంటే భయపడే విధంగా వైమానిక దాడులు నిర్వహించారని అన్నారు. అమాయక యాత్రికుల ప్రాణాలను తీసిన ఉగ్రవాదులను ఎట్టి పరిస్థి



,ప్యాట్నీ సెంటర్ లో టపాకాయలు పేల్చి స్వీట్లు పంచుకున్న బీజేపీ శ్రేణులు.

తుల్లో ఉపేక్షించవద్దని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు చీరె సుచిత్రా శ్రీకాంత్,కొంతం దీపిక ,కేతినేని సరళ,సుప్రియా నవీన్‌గౌడ్,మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి,నాయకులు నెమలి ఆనంద్, చీరె సత్యనారాయణ(శ్రీకాంత్),మేకల సారంగా పాణి, సందీప్‌వర్మ,కనకట్ల హరి,శ్రీశైలం గౌడ్,ఆకుల ప్రతాప్,రాజశేఖర్‌రెడ్డి,ఆర్.కృష్ణమూర్తి,ప్రభుగుప్తా,జితేందర్ ,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మైనింగ్ కేసులో కడిగిన ముత్యంలా బయటపడ్డ సబితారెడ్డి

**- మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ**

**నార్సింగి, మే 7 ప్రభాతవార్త :** ఓబులాపురం మైనింగ్ కేసులో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కడిగిన ముత్యంలా బయటపడ్డారని మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. బుధవారం మణికొండ బిఆర్ఎస్ నాయకులు సబితారెడ్డి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ సబితారెడ్డి తనపై పెట్టిన అక్రమ కేసులకు భయపడకుండా, విచారణ అధికారులకు పూర్తిగా సహకరించి తనపై పెట్టిన అక్రమ కేసులపై న్యాయస్థానం నిర్దోశిగా ప్రకటించడం తమను ఆనందడోలికల్లో ముంచెత్తిందన్నారు. మా నాయకురాలు నిర్దోశి అని మొదటి నుంచి మేము నమ్మామని, ఇప్పుడు న్యాయస్థానం తీర్పుతో లోకానికి తెలిసిందన్నారు. నిజాయతీ, నీతివంతమైన పాలన అందించేందుకు సబితారెడ్డి అహర్నిషలు పని చేస్తున్నారని, ఆమెపై తప్పుడు కేసులు పెట్టి ఇన్నాళ్లు మానసిక క్షోభకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశా



ఓబులాపురం మైనింగ్ కేసులో నిర్దోశిగా బయటపడ్డ మాజీ మంత్రి సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మణికొండ బిఆర్ఎస్ నేతలు

రు. ప్రజాక్షేత్రంలో ఉన్న నాయకులు తమపై తప్పుడు కేసులు, ఆరోపణలు వస్తే కోర్టులో తమ నిర్దోశిత్వంను నిరూపించుకోవాలని సూచించారు. కేసుల నుంచి తప్పించుకునేందుకు స్టేలు తెచ్చుకుంటే తప్పు చేసినట్లే అవుతుందన్నారు. సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ధన్‌రాజ్, నరేందర్, రూపారెడ్డి, అందె లక్ష్మణ్‌రావ్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, విజయలక్ష్మి, రాజేంద్రప్రసాద్, జైరామ్, భానుచందర్, సుమనళిని, రమణమూర్తి తదితరులు ఉన్నారు.

## కళలు, సంప్రదాయాలపైనా అవగాహన కల్పించాలి




పురస్కారాలు ప్రదానం చేస్తున్న ప్రముఖ కవి, బాలభవన్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ ఎం కె రాము

**చిక్కడపల్లి, మే 7 ప్రభాతవార్త:** ఉరుకుల పరుగుల జీవితంలో పిల్లలకు కేవలం చదువే కాకుండా మన కళలు, సంప్రదాయాలపైనా అవగాహన కల్పించాలని ప్రముఖ కవి, బాలభవన్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ ఎం కె రాము అన్నారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో శ్రీ శాంభవి కూచిపూడి ఆర్ట్ అకాడమీ నృత్య ప్రేరణ పురస్కారాలు 2025 ప్రదానోత్సవ కార్యక్రమానికి డాక్టర్ ఎం.కె.రాము ముఖ్య అతిథిగా హాజరై పురస్కారాలు ప్రదానం చేసి ప్రసంగించారు. కూచిపూడి నాట్యం నేర్చుకోవడం వల్ల ఓపికతో పాటు పిల్లలకి జీవన విధానంలో మార్పులు వస్తాయని, అవి పిల్లలకి చాలా ఉపయోగపడతాయని చెప్పారు. కూచిపూడి నాట్యప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన రొహాలిక, బట్లంకి సాయి శాన్వి, శాన్వి శ్రీపవార్, తన్విలతో పాటు పలువురు చిన్నారులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కాకునూరి సూర్యనారాయణ మూర్తి, నటుడు, క్లాసికల్ డాన్సర్ కౌశిక్ బాబు, గూడెపు నర్సింగరావు, లలితా ధనలక్ష్మి మ్మ గొల్లపల్లి, శృతి తేజో మూర్తుల, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధ దంపతుల హత్య కేసులో వీడిన మిస్టరీ..




వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ జోన్ డిసిపి కోటిరెడ్డి

**పేట్ బషీరాబాద్, మే 7, ప్రభాతవార్త**

అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధి సూర్య నగర్ ప్రాంతానికి చెందిన అల్లి కనకయ్య (70), అల్లి రాజమ్మ (65) గత కొంతకాలంగా ఓ రేకుల ఇంట్లో కిరాయికి ఉంటూ వాచ్మెన్, కూలి పనులు చేసుకుంటూ ఎవరిపై ఆధార పడకుండా వృద్ధాప్యంలో కాలం వెలదీస్తున్నారు. ఈ నెల 4న అర్ధరాత్రి వారు నిద్రిస్తున్న రేకుల ఇంట్లోకి ఓ నిందితుడు చొరబడి వారిని కర్రతో కొట్టి చంపి, వృద్ధురాలు మెడలోని బంగారు పుస్తెలు, వెండి పట్టగొలుసులు, నగదుతో పాటు రెండు సెల్ ఫోన్‌లను దొంగలించి పరారయ్యాడు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగి నిందితుడి కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టగా కొన్ని ఆధారాల మేరకు అల్వాల్ మచ్చ బొల్లారం కృష్ణా నగర్ కాలనీకి చెందిన చింతకింది అనిల్ (37)ను పట్టుకొని విచారించగా ఈ నేరానికి పాల్పడిన ప్రధాన నిందితుడిగా పోలీసులు తేల్చారు. ఈ సమావేశంలో మేడ్చల్ జోన్ అడిషనల్ డిసిపి పురుషోత్తం, పేట్ బషీరాబాద్ ఏసిపి కే రాములు, అల్వాల్ సిఐ రాహుల్ దేవ్, డిఐడి తిమ్మప్ప, సిసిఎస్ మేడ్చల్ సీఐ దాలినాయుడు, ఎస్ఓటి సీఐ శ్యాంసుందర్ రెడ్డితో పాటు ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

## సార్ధక నామధేయం చిరుకథల చిద్విలాసం కథల సంపుటి : కె.వి.రమణాచారి

**నాంపల్లి, మే 7 ప్రభాతవార్త :** సాంస్కృతికబ్రహ్మ గుదిబండి వెంకటరెడ్డి సంపాదకత్వంలో సాహితీ కిరణం ప్రచురించిన పోస్ట్‌కార్డు కథలు చిరుకథల చిద్విఆలాసం సార్ధక నామధేయమని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అభివర్ణించారు. ప్రవృత్తిరీత్య రచయిత అయిన వెంకటరెడ్డి వృత్తిరీత్యా ప్రభుత్వ కమర్షియల్ శాఖలో పనిచేశారు కనుక ఇలాంటి పేర్లుపెట్టడం చిద్విలాసమేనని చమత్కరించారు. జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని డా. కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు గుదిబండి వెంకటరెడ్డి నిర్వహణలో ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం సభాధ్యక్షతన జరిగిన ఈ గ్రంథావిష్కరణకు డా. కె.వి.రమణాచారి ముఖ్యఅతిథిగా విచ్చేసి గౌరవ అతిథులు సి.రామకృష్ణ, లంక లక్ష్మీనారాయణ, పొత్తూరి సుబ్బారావు, వడ్లకొండ వెంకటరావు, రచయిత గుదిబండి వెంకటరెడ్డి తదితరులతో కలిసి చిరుకథల చిద్విలాసం-పోస్ట్‌కార్డు కథలు గ్రంథాన్ని ఆవిష్కరించి రచయితను ఘనంగా సత్కరించి అభినందించి వడ్లకొండ వెంకటరావుకు సన్మానించి తొలిప్రతిని అందించి అంకితోత్సవం కావించి ప్రసంగించారు. ఇందులో



చిరుకథల చిద్విలాసం గ్రంథావిష్కరణ కావిస్తున్న రమణాచారి, ఓలేటి, లంక, గుదిబండి, పొత్తూరి తదితర అతిథులు

కథలు వ్రాసిన రచయితలు అంశానికి అనుగుణంగా తమ కథలను చక్కగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. పాల్గొన్న రచయితలు ఎంతరో సుప్రసిద్ధులు ఉండడం మరీ విశేషమని తెలిపారు. ఈ సందర్భంగా కొన్ని కథలను రమణాచారి ఉటంకించారు. సభకు ముందు సంగీత గురువు కె.సుప్రియ చక్రవర్తి, శిష్యబృంద సంగీత కార్యక్రమం ఆహుతులకు వీనులవిందు చేసింది.

## జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించడమే మా లక్ష్యం

**-టికెట్‌లు ఎవరికి వచ్చినా అందరూ కలిసి పనిచేయాలి**

**-కాంగ్రెస్ నేత సి.ఎ వేణుగోపాలస్వామి**

**హైదరాబాద్, మే 7,ప్రభాతవార్త:**

త్వరలో జరిగే జిహెచ్ఎంసి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ నేత సి.ఏ వేణుగోపాల్ అన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు డివిజన్ స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు బుధవారం సోమాజిగూడలోని మెరిక్యూర్ హోటల్‌లో ఖైరతాబాద్ కాంగ్రెస్‌నేత మాజీ కార్పొరేటర్ రాజు యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హిమాయత్‌నగర్ డివిజన్ కార్యదర్శులు సమావేశానికి వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అన్ని డివిజన్ల ప్రజలకు తెలియజేస్తూ ప్రజలను ఏకతాటిపై తీసుకువచ్చి కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజారిటీతో గెలుపొందేలా కృషి చేయాలన్నారు. ప్రతి బూత్ ఇంచార్జ్ పది మంది కార్యకర్తలను తయారు చేసి ప్రజల్లో మమేకమయ్యేటట్లు చూడాలన్నారు. పార్టీ కోసం పనిచేస్తే కార్పొరేటర్, అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు పోటీ చేయాలనేది పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందని అధిష్టాన నిర్ణయం మేరకు ముందుకు సాగాలన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాలస్వామి, రాజుయాదవ్ తదితరులు

మాజీ కార్పొరేటర్ రాజుయాదవ్ మాట్లాడుతూ అధికారం ఎక్కడ ఉంటే అక్కడికి వచ్చే వసల నేతలే కాంగ్రెస్‌కు శాపంగా మారారని వారితోనే పార్టీకి నష్టం జరుగుతుందన్నారు. ఇనాళ్లు పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాలని ఖైరతాబాద్ నియోజకవర్గంలో అన్నిడివిజన్లలో కాంగ్రెస్ జెండా ఎగరేలా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాసిర్, గోకుల కళ్యాణ్, శ్రీరామ్, యాసీన్ ,శ్రీనాథ్, మెహతా, భక్తియార్, రాజ్‌కుమార్, అప్సర్‌ఖాన్, వెంకటేష్, నాసిర్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**పేట్ బషీరాబాద్, మే 7, ప్రభాతవార్త**

132 జీడిమెట్ల డివిజన్ అయోధ్య నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో గ్రేస్ క్యాన్సర్ హౌండేషన్, బైబిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్యశిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని, ఈ వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగ పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బైబిల్ మిషన్ పాస్టర్ చిట్టి బాబు, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, జిహెచ్ఎంసి డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నదీమ్ రాయ్, ఎల్లా గౌడ్, విజయ్ హరీష్, శ్రీకాంత్, గుబ్బల లక్ష్మీనారాయణ, పందిరి యాదగిరి, అయోధ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యేసు, ఉపాధ్యక్షులు ఉమేష్ సింగ్, కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు బాల్ రాజ్ గౌడ్, సోమనర్సయ్య, మహిళా నాయకురాలు నర్మదా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### ప్రతీకారానికి చిహ్నమే ఆపరేషన్ సింధూర్ : వెంకటేష్ గౌడ్

**కెపిహెచ్‌బి కాలనీ, మే 7, ప్రభాతవార్త**

పహల్గామ్ బాధిత మహిళల ప్రతీకారానికి చిహ్నమే ఆపరేషన్ సింధూర్ అని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ పేర్కొన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ గుడ్ విల్ హోటల్ చౌరస్తాలో డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ డివిజన్ నాయకులతో కలిసి భారత్ మాతాకి జై, పాకిస్తాన్ డౌన్ డౌన్ నినాదాలతో టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ . ఉగ్రవాదుల పేహల్గామ్ దాడికి కౌంటర్గా ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన సందర్భంగా ఆల్విన్ కాలనీలో పెద్ద ఎత్తున సంబరాలు చేపట్టాం అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, మైనారిటీ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 20న దేశవ్యాప్త సమ్మెకు సహకరించాలి : సిఐటియు

**-కార్మికుల హక్కులను పరిరక్షించాలి..**

**-లేబర్ కోడ్స్ అమలు చేయొద్దు..**



నోటీసులు ఇస్తున్న నాయకులు

**నిజాంపేట్, మే 7, ప్రభాతవార్త**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, అలీఫ్ ఇండస్ట్రియల్ ఏరియాలలో 20 మే దేశభక్తి సమ్మెను జయప్రదం చేయడానికి యాజమాన్యాలు సహకరించాలని బుధవారం బాచుపల్లి ఇండస్ట్రియల్ ఏరియా కమిటీ సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం కార్మికుల పైన కార్మిక హక్కుల పైన ఎక్కుపెట్టిన యుద్ధంలో దేశవ్యాప్తంగా కార్మిక లోకం ఐక్యమై పోరాటం చేస్తున్నదని అన్నారు. యుద్ధంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ మతోన్మాద అనుకూల విధానాలకు, కార్మికులను బానిసలుగా మార్చే కార్మిక కోడ్లు అమలు చేయాలనే ఆపేక్ష అనేది ముఖ్యమైన భాగంగా ఉందన్నారు. ముఖ్యంగా పని గంటలు పెంపుదల, పని పరిస్థితులలో మార్పులు ట్రేడ్ యూనియన్ హక్కులను హరించడం శ్రమ దోపిడీని తీవ్రతరం చేయడం కార్పొరేట్ల లాభాపేక్ష నెరవేర్చడం కోసమే కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఆగ్రహం వెలిబుచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలని ప్రైవేటీకరణ ఆపాలని కాంట్రాక్టు విధానం రద్దుచేసి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయలుగా నిర్ణయించాలన్నారు. ఈ కార్యక్రమంలో భీ.మణిక్యం, ప్రవీణ్, నీరుడి యాదయ్య, కే. ఆంజనేయులు, పవన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

### జెన్‌కో సిఎండిని కలిసిన పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్

**-ఇంజనీర్లకు పదోన్నతులు కల్పించడం పట్ల హర్షం**



సిఎండీని సన్మానిస్తున్న సదానందం, సురేష్, విద్యాసాగర్, బుచ్చయ్య తదితరులు

**హైదరాబాద్, మే 7,ప్రభాతవార్త:**

2012 బ్యాచ్‌కి చెందిన అసిస్టెంట్ ఇంజనీర్లకు అసిస్టెంట్ డివిజనల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్లు ఇచ్చినందుకు టిజి జెన్‌కో సిఎండీ సందీప్ కుమార్ సుల్తానియను తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ మర్యాదపూర్వకంగా కలిసింది. ఆమేరకు అసోసియేషన్ సెక్రటరీ జనరల్ పి. సదానందం ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం విద్యుత్‌సౌధలోని సుల్తానియా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించింది. ఈసందర్భంగా గత 15 సంవత్సరాల కాలంలో ఇంత పెద్ద సంఖ్యలో 209 మందికి పదోన్నతులు కల్పించడం ఇది మొదటిసారి అని ఇంజనీర్లు పేర్కొన్నారు. సిఎండీని కలిసిన వారిలో ప్రతినిధులు సురేష్ కుమార్, విద్యాసాగర్, బుచ్చయ్య, పీవీ రావు, ప్రశాంత్, వెంకటేశ్, మల్లయ్య,రాజేశ్వర్ ఇతర నాయకులు ఉన్నారు.

### ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుక



**అల్వాల్, మే 7 ప్రభాతవార్త:** అల్వాల్ సూర్యనగర్‌లో వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బొల్లారం ఆర్యవైశ్యులు ఆధ్వర్యంలలో అమ్మవారికి అభిషేకం ,కుంకుమార్చన తదితర క్రతువులను నిర్వహించారు. జయంతి ఉత్సవానికి ముఖ్య అతిధులుగా అల్వాల్ మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు శ్రీ మంచాల ప్రభాకర్ ,శ్రీహరి, శ్రీమతి తడక మంజుల వెంకటేష్, మాధవి, కవిత, సరిత, మమత పాల్గొన్నారు.

### వ్యభిచారం నిర్వహిస్తున్న విదేశీ మహిళ అరెస్టు

**కంటోన్మెంట్,మే 7 ప్రభాతవార్త:** గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ విదేశీ మహిళను బోయిన్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు తెలిపిన వివరాల ప్రకారం కకుమీరో ప్రాంతానికి చెందిన ఎం.బాబాజీ షారోన్ 23, పర్యాటక వీసాపై విదేశీ మహిళ భారత దేశానికి వచ్చింది. వీసా ముగిసినప్పటికి నగరంలోనే ఉంటూ గుట్టుచప్పుడుకాకుండా వ్యభిచారం నిర్వహిస్తుంది. సంవత్సరం క్రితం ముంబాయికి వచ్చి పప్పుదినుసులు, కార్గో వ్యాపారం చేస్తున్నది. గత జనవరి 27తో వీసా గడువు ముగిసింది. ఈ క్రమంలో ముంబాయి నుండి నగరానికి వచ్చి తాడ్‌బంద్‌లోని ఓ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని నివాసం ఉంటుంది. ఆయువతి, ఉగాండ దేశానికి చెందిన అమ్మాయిల ఫోటోలోనూ గ్రిండర్ యాప్‌లో పొందుపర్చి విటులను అకర్షించి మరో అమ్మాయిలతో కలిసి వ్యభిచారం నిర్వహిస్తుంది. విశ్వాసనీయ సమాచారం మేరకు పోలీసులు వ్యభిచారం గృహంపై దాడులు నిర్వహించి ఎం.బాబాజీ షారోన్‌తో పాటు మరో ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు ఆధ్వర్యంలో ఎస్ఐ నాగేందర్ బాబు దర్యాప్తు చేస్తున్నారు.

### తెలుగు విశ్వవిద్యాలయంలో ఫైన్‌ఆర్ట్స్ ఫిల్మ్‌యాక్టింగ్‌లో శిక్షణ

**: రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు**

**నాంపల్లి, మే 7 ప్రభాతవార్త :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి హైదరాబాద్ ప్రాంగణంలో విశ్వవిద్యాలయ శిల్పం, చిత్రలేఖనంశాఖ, రంగస్థల కళలశాఖ సంయుక్త నిర్వహణలో వేసవి సెలవులలో ఫైన్‌ఆర్ట్స్, ఫిల్మ్ యాక్టింగ్‌లలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కోట్ల హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 15వ తేదీ నుండి శిక్షణా తరగతులు ప్రారంభమై నెలరోజులపాటు నిర్వహించడం జరుగుతుందని, శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు సర్టిఫికెట్ కూడా ఇస్తామని తెలిపారు. ఈ కోర్సులకు 5వేల రూపాయల ఫీజును చెల్లించవలసి ఉంటుందని, సంబంధిత డిమాండ్ డ్రాఫ్ట్ రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరిట చెల్లించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫైన్‌ఆర్ట్స్ 8309011865/ ఫిల్మ్ యాక్టింగ్ 9346461733 నంబర్లలో సంప్రదించాలని రిజిస్ట్రార్ తెలియజేశారు.


మాట్లాడుతున్న అత్తు

## 'ఆపరేషన్ సింధూర్'ను కొనసాగించాలి

### కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు

**సిద్దిపేట అర్బన్, మే 7, ప్రభాతవార్త :** పహల్గాంలో విచక్షణ రహితంగా కాల్పులు జరిపిన ఉగ్రవాదులకు సరైన గుణపాఠం చెప్పే సమయం వచ్చిందని.. దేశ ప్రజలంతా ఏకం కావాలని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) పిలుపునిచ్చారు. సిద్దిపేటలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగ్రవాదులను ఏరిపారేయడానికి అపరేషన్ సింధూర్ కొనసాగించాలన్నారు. ఉగ్రవాదులు దేశం వైపు చూడాలంటేనే శరీంలో వణుకు పుట్టాలన్నారు. కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు దేశం వైపు నిలబడుదామన్నారు. భారత్ సైనికులకు దేవుడు అండగా నిలవాలని ప్రజలంతా పూజలు, ప్రార్థనలు చేయాలన్నారు. ఉగ్రవాదానికి దేశంలో ఎప్పటికి చోటు లేదన్నారు ఉగ్రవాదులను చంపే వరకు అపరేషన్ సింధూర్ కొనసాగించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మధు, గయాజుద్దీన్, నవాజ్, మహేష్, ఫయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించాలి

### బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లిఖార్జున్‌రెడ్డి


రైతులతో మాట్లాడుతున్న నాయకులు

**అక్కన్నపేట, మే 7, ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలోని గౌరవెల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని పార్టీ శ్రేణులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నుండి రైతులను పట్టించుకోవడం లేదన్నారు. కొనుగోల్లు వేగంగా చేయకపోవడం వల్ల ఎంతో మంది రైతులు అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల వద్ద పోసిన ధాన్యం నానిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల వల్ల వరి, మామిడి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలపి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్‌వి రాష్ట్ర అధికార ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పర్షరాములు, నాయకులు గోపగోని అరవింద్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## మండల మహాసభలను విజయవంతం చేయండి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వనేష్


మాట్లాడుతున్న వనేష్

**అక్కన్నపేట, మే 7, ప్రభాతవార్త :** ఈనెల 16వ తేదీన మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో నిర్వహించే సిపిఐ పార్టీ మండల మహాసభలకు పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎడల వనేష్ పిలుపునిచ్చారు. బుధవారం రోజున మండలంలోని గౌరవెల్లి గ్రామంలో పార్టీ మండల సమితి ఆధ్వర్యంలో మహాసభల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్‌తో కలసి ఇందుకు సంబందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించబోయే సమావేశాలకు రావాలని కోరుతూ ఉపాధి హామీ కూలీలు, కార్మికులు,రైతులకు కరపత్రాలను పంపిణీచేసి మాటాడుతూ 100 ఏండ్ల చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ అనునిత్యం ప్రజా సమస్యలపై ఉద్యమాలు, పోరాటాలు చేస్తుందని గుర్తు చేశారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నుండి కార్పోరేటీకరణను వేగవంతం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ శక్తులకు కట్టబెట్టడంతో పాటు పెట్రోల్, డీజిల్, నిత్యవసర సరుకుల ధరలను పెంచుతూ రైతుల పేద ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు జేరిపోతుల జనార్ధన్(జేజే),బొజ్జపురి రాజు, మంద శ్రీను, నాయకులు సుధాకర్, చీకట్ల తిరుపతి, రమేష్, శ్రీనివాస్, రవి, సంతోష్, రంగయ్య, భాస్కర్, చిరంజీవి ఉన్నారు.

## గజ్వేల్‌లో జాబ్‌మేళా

**గజ్వేల్ టౌన్, మే 7 (ప్రభాతవార్త):**

ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ కంపెనీలో ఉద్యోగాల కోసం బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో గజ్వేల్ చుట్టుపక్కల నుండి నిరుద్యోగులు, విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు వినోద్‌చారి, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, సభ్యులు సుధాకర్, వెంకటేష్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూ చేయడం జరిగిందని, ఉత్తమ ప్రతిభ కనబర్చిన నిరుద్యోగ యువతను ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు.

## ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు

**గజ్వేల్ టౌన్, మే 7(ప్రభాతవార్త):** శ్రీసీతారామ ఉమామహేశ్వరాలయం లోగల శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం వాసవిమాత జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపుకొమ్ములతో అభిషేకం నిర్వహించారు. అనంతరం సామూహిక వాసవి కన్యకాపరమేశ్వరి పారాయణం, కుంకుమార్చన కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్దలతో నిర్వహించి, వాసవిమాత కీర్తనలు, భజనలు ఆలపించి అమ్మవారిని ప్రత్యేకంగా పూజించారు. అనంతరం అక్కడే ఏర్పాటుచేసిన ఆర్యవైశ్య మహాసభ గజ్వేల్ మండల, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణ నూతన కమిటీ కార్యవర్గ సభ్యుల ప్రమాణీ స్వీకార మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.


వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పసుపు కొమ్ములతో అభిషేకం చేసిన దృశ్యం

# ఆర్యవైశ్యులది ధర్మబద్ధమైన వ్యాపారం

### ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

**గజ్వేల్, మే 7 (ప్రభాతవార్త):** సకల గుణ సంపన్నులు ఆర్యవైశ్యులు అని, ధర్మబద్ధమైన వ్యాపారం వారికే సాధ్యమని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సా రెడ్డి పేర్కొన్నారు.ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడిగా గజ్వేల్ పట్టణానికి చెందిన జగ్గయ్యగారి శేఖర్‌గుప్త, పట్టణ అధ్యక్షుడిగా అత్తెల్లి శ్రీనివాస్‌గుప్త ఎన్నికకాగా బుధవారం శ్రీసీతారామ ఉమామహేశ్వరాలయంలో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సా రెడ్డి పాల్గొని మాట్లాడారు. శ్రీవాసవీ మాత జయంతి ఉత్సవాలలో పాల్గొనడం అదృష్టమన్నారు. అలాగే పేద ఆర్యవైశ్యుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందన్నారు. సేవాభావం కలిగిన ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు శేఖర్‌గుప్తకు, అత్తెల్లి శ్రీనివాస్‌లకు సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. మారుతున్న కాలానుగుణంగా ఆర్యవైశ యువత, మహిళలు అన్నిరంగాలలో ముందుండాలని కోరారు. విద్య, వ్యాపార రంగాలతోపాటు రాజకీయ, సామాజిక సేవలో మరింత ముందుకు రావాలని ఆకాంక్షించారు. నిష్కల్మషమైన మంచి మనస్తత్వం, సేవా భావం, దాతృత్వం కలిగిన గజ్వేల్ ఆర్యవైశ్యులతో తనకు ఎంతో సాన్నిహిత్యం ఉన్నట్లు గుర్తుచేశారు. ఎవరిపై ఆధారపడకుండా తమ కష్టాన్ని నమ్ముకుంటూ నిజాయతీగా సంపాదించే ఆర్యవైశ్యులు సమాజంలో ఆదర్శంగా నిలుస్తున్నట్లు తెలిపారు. సంపాదించిన డబ్బులో కొంత దానధర్మాలు, సేవా కార్యక్రమాలు చేసి పేద ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తున్న జగ్గయ్యగారి శేఖర్, అత్తెల్లి శ్రీనులను అభినందించారు.



శేఖర్‌గుప్తను సన్మానించి పూలబొకేను అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, తూంకుంట నర్సా రెడ్డి

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు రాజమౌళి, గాడి పల్లి భాస్కర్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు తద్కమడ్ల ఆంజనేయులుగుప్త, మాజీ అధ్యక్షుడు కాసం నవీన్‌గుప్త, ప్రధానకార్యదర్శి హరినాథ్ గుప్త, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఉప్పల శ్రీనివాస్, మహంకాళి శ్రీనివాస్‌గుప్త, కరుణాకర్‌రెడ్డి, నర్సింహా రెడ్డి, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, నాచారం నిత్యాన్నదాన సత్రం చైర్మన్ కొమురవెల్లి శంకరయ్యగుప్త, నాచారం ట్రస్టు మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు సిద్ది బిక్షపతి, సొక్కం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ లైన్ దాటితే చర్యలు సహజం

### రాష్ట్ర హౌజ్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి

**హుస్నాబాద్ రూరల్, మే 7 ప్రభాతవార్త :** పార్టీలో ఎంత సీనియర్ అయినా, మాజీ మంత్రి అయినా పార్టీలైన్ దాటితే కాంగ్రెస్ పార్టీలో చర్యలు తీసుకోవడం సహజమేనని రాష్ట్ర హౌజ్‌ఫెడ్ మాజీ చైర్మెన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నేతల మధ్య సమన్వయ లోపం ఉండకుండా ఏ స్థాయి లీడర్ అయినా కార్యకర్తలందరిని కలుపుకుని పోవడమే పార్టీ సిద్దాంతం అని, తీన్మార్ మల్లన్న, పురమల్ల శ్రీనివాస్ మున్నూరు కాపు కులానికి చెం దినవారని వారి ప్రవర్తన, పార్టీ ఆదేశాల మేరకు పనిచేయకపోవడం వల్ల సస్పెండ్ చేసిందని వారి సస్పెండ్ పట్ల కొంత మంది మున్నూరు కాపు నాయకులు సామాజిక మాధ్యమాలలో అసత్య ఆరో పణలు చేయడం సబబుకాదన్నారు. టిపిసిసి అధ్యక్షుడిగా ఉన్న మహేష్‌కుమార్‌గౌడ్, రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ గౌడ్ ఇద్దరు గౌడ సామాజికవర్గానికి చెందిన వారు కావడంతోనే వారు మున్నూరు కాపు లను టార్గెట్ చేస్తున్నారని అసత్యాలు చేయడం తగదన్నారు. దేశానికే తెలంగాణ రోల్ మోడల్‌గా ఉం డాలనే సంకల్పంతో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పినట్లు, ఎవరు ఎంతో వారికి అంత అన్న విధంగా కాంగ్రెస్ కుల గణన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కుల గణన లెక్కలు తప్పుగా ఉన్నాయని కాంగ్రెస్‌లో ఉన్న తీన్మార్ మల్లన్న పార్టీ లైన్ దాటా రని, పురుమల్ల శ్రీనివాస్ సైతం పార్టీలో చేరిన కొద్ది రోజులకే కరీంనగర్ పార్టీ ఇంచార్జ్‌గా పార్టీ నియమించి తనకు పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యే టికెట్ ఇస్తే పార్టీ సీనియర్ నాయకుడిగా ఉంటూ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్లనే వారిని సస్పెండ్ చేయ డం జరిగిందన్నారు. మంత్రి పొన్నం ప్రమయం లేకుండానే తనకు ఎమ్మెల్యే టికెట్ వచ్చిందా అని ప్రశ్నించారు. సీనియర్ నాయకుడైన పొన్నంను బహిరంగంగా అప్రదిష్టపాలు చేస్తే పార్టీ అధిష్ఠానం ఎలా చూస్తూ ఊరుకుంటుందన్నారు. పురుమల్ల శ్రీనివాస్ పలుమార్లు పార్టీ లైన్ దాటినా పలుమార్లు హెచ్చరిం చిందని తీరు మార్చుకోకపోవడం వల్లనే సస్పెండ్ చేసిందన్నారు. వేములవాడ ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆది శ్రీనివాస్ ఎమ్మెల్గా గెలిచినందుకు గుర్తించిన ప్రభుత్వం విప్ పదవి ఇచ్చిందని ఆయన మంత్రి పదవిని కూడా ఎవరూ అడ్డుకోలేదని అనవసరంగా కుల పార్టీలో కుల రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. ఇప్పటికైనా నీచరాజకీయాలు మానుకోవాలన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో అంబలి పంపిణీ

**గజ్వేల్ టౌన్, మే 7 (ప్రభాతవార్త):** పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో 1984 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు చౌరస్తా వద్ద అంబలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం గజ్వేల్ పట్టణంలో సంత జరుగుతున్నందున ఇక్కడకు వచ్చే రైతులు, ప్రజల దాహార్తిని తీర్చడానికి అంబలి పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, లయన్ నేతి శ్రీనివాస్, ఉమాదేవి, బ్రమరాంబ, సుచరిత, ఎన్‌సి. శ్రీనివాస్, గంగిశెట్టి శ్రీనివాస్, జగ్గయ్యగారి శ్రీనివాస్, రాందాస్‌గౌడ్, తోట బిక్షపతి, గుంటుకు యాదగిరి, దూబకుంట లచ్చులు, నర్సింలు, నేతి వేణు గోపాల్, ఓబుల్‌రెడ్డి, గందె రమేష్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణవేణి, జ్ఞానేశ్వర్, గౌరిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు

**కొల్చారం, మే 7, ప్రభాతవార్త:** రేషన్ బియ్యం పంపిణీలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అన్నారు. బుధవారం రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ శ్రీనివాస్‌చారిని మర్యాదపూర్వకంగా కలిసి, రేషన్ డీలర్లు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ చారి మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నిజాంపురం ప్రభాకర్ గుప్తా, బొజ్జ వెంకటరమణ, దిలీప్,ఎగొండ, సంతోష్, రెవెన్యూ సిబ్బంది నగవర్ధన్, ప్రభాకర్ పాల్గొన్నారు.


తహసీల్దార్ శ్రీనివాస్ చారిని సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

## డిగ్రీ అడ్మిషన్లకు దోస్త్ షెడ్యూల్ విడుదల

**మెదక్ అర్బన్, మే 7, ప్రభాతవార్త:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్‌లో ప్రథమ సంవత్సరంలో వివిధ డిగ్రీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. హుస్సేన్ తెలిపారు. ఇందుకోసం తెలంగాణ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) నోటిఫికేషన్ విడుదలైనట్లు తెలిపారు. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందదలచిన విద్యార్థులు దోస్త్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకుని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మొదటి ప్రాధాన్యతగా ఎంపిక చేసుకోవాలని ఆయన సూచించారు. 2025-26 విద్యాసంవత్సరానికి డిగ్రీ ప్రవేశాల షెడ్యూల్ (దోస్త్): ఫేజ్ 1: రిజిస్ట్రేషన్ (ఫీజు:..200) 03.05.2025 నుంచి 21.05.2025 వరకు, ఫేజ్ 2: రిజిస్ట్రేషన్ (ఫీజు:..400 ) 30.05.2025 నుంచి 08.06.2025 వరకు, ఫేజ్ 3: రిజిస్ట్రేషన్ (ఫీజు:..400) 13.06.2025 నుంచి 19.06.2025 వరకు జరుగుతుందన్నారు. తదుపరి ప్రక్రియలో, సీటు పొందిన విద్యార్థులు జూన్ 24 నుంచి జూన్ 28 మధ్య కళాశాలలో హాజరు నమోదు చేయవలసి ఉంటుందని, అదే తేదీల్లో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించబడతాయని, తరగతులు జూన్ 30న ప్రారంభమవుతాయన్నారు. ప్రస్తుతం కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, సీట్లు ఈ విధంగా ఉన్నాయి. ఫిజికల్ సైన్స్ విభాగంలో ఎం.పి.సి/ఎం.పి.సి.ఎస్ కోర్సులకు 180 సీట్లు, లైఫ్ సైన్స్ విభాగంలో బి.జడ్.సి (తెలుగు మీడియం)కి 120 సీట్లు, బి.జడ్.సి/బి.జడ్.సి.ఎస్/బి.జడ్.సి.ఎస్.వై (ఇంగ్లీష్ మీడియం)కి 180 సీట్లు, బి. కామ్ (కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సులో తెలుగు మీడియం 60 సీట్లు, ఇంగ్లీష్ మీడియం 180 సీట్లు, బి.ఏ కోర్సులో తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం రెండింటికీ తలా 120 సీట్లు, బి.బి.ఏ (లాజిస్టిక్స్) కోర్సుకు 60 సీట్లు అందుబాటులో ఉన్నట్లు ఆయన వివరించారు. అదేవిధంగా, మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్ జిల్లా స్థాయిలో దోస్త్ డిస్ట్రిక్ట్ హెల్ప్‌లైన్ సెంటర్‌గా గుర్తించబడిందని తెలిపారు. దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో విద్యార్థులకు సాంకేతిక సమస్యలు ఎదురైతే, కళాశాల పని దినాలలో కార్యాలయ సమయాల్లో హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. దోస్తు అడ్మిషన్లకు సంబంధించిన మరిన్ని వివరాల కొరకు దోస్తు కోఆర్డినేటర్: పిల్లి సురేందర్‌రావుని (7901396797), టెక్నికల్ అసిస్టెంట్లు ఎం కాశీ విశ్వనాథ్ (8121548345), మానయ్య (9032983233) లను కళాశాల పని దినములలో, కార్యాలయం పని వేళలలో సంప్రదించగలరని తెలియజేశారు.

రైతు నమోదు ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం ప్రారంభం...

## ప్రతి రైతు గుర్తింపు కార్డులు పొందాలి

### మండల వ్యవసాయాధికారి రాజ్‌నారాయణ

**రామాయంపేట మున్సిపాలిటీ, మే 7, ప్రభాతవార్త**

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో కీలకం అయినటువంటి ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు సంబంధించిన నమోదు ప్రక్రియను రామాయంపేట మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం ఆవరణలో బుధవారం నాడు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్చార్జి వ్యవసాయ సంచాలకులు రాజ్ నారాయణ మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు సంబంధించిన వివరాలను వ్యవసాయ శాఖకు అందించాలని సూచించారు. ఈ క్రమంలో తమ పట్టాదారు పాస్ పుస్తకం మరియు ఆధార్ కార్డు నెంబరు ఆధార్ కార్డుకు జత చేసినటువంటి మొబైల్ ఫోన్ నెంబరు అందజేయాల్సి ఉంటుందన్నారు.ఈ మొబైల్ నెంబర్ కు మూడు ఓటిపిలు రావడం జరుగుతుందని, వివరాలను వ్యవసాయ విస్తీర్ణాధికారికి అందించినట్లయితే 11 అంకెలతో కూడినటువంటి రైతు విశిష్ట సంఖ్య అందజేయబడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుల కోసం చేపట్టేటువంటి వివిధ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకంగా ఉండడానికి ఈ విశిష్ట సంఖ్య ఎంతో కీలకం కానుందని పేర్కొన్నారు. కావున రైతులు తప్పనిసరిగా ఈ రైతు విశిష్ట సంఖ్యను పొందడానికి పైన పేర్కొన్నటువంటి వివరాలు వ్యవసాయ శాఖ అధికారులకు అందజేయాలన్నారు.

ఈ విశిష్ట సంఖ్య కేవలం కేంద్ర ప్రభుత్వం చేపట్టేటువంటి సంక్షేమ పథకాలకు మాత్రమే ఉపయోగపడుతుందని, ముఖ్యంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్ బీమా యోజన, రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజన వంటి పథకాల అమలులో ఈ విశిష్ట సంఖ్య తప్పనిసరిగా అవసరముంటుందని అన్నారు. ముఖ్యంగా వచ్చే 20వ విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధులు విడుదల కావాలంటే ఈ 11 సంఖ్యల రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరి కానుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

**గజ్వేల్ టౌన్, మే 7 (ప్రభాతవార్త):** కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సా రెడ్డి పేర్కొన్నారు.బుధవారం గజ్వేల్ పట్టణంలోని ఢిల్లీవాలా హోటల్ సమీపంలో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గజ్వేల్ మున్సిపల్ అభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ పేద ప్రజలను కలవడం కష్టంగా మారిందన్నారు. గతంలో చేసిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయని, అభివృద్ధి పనులపై దృష్టి సారించాలన్నారు. అర్హులైన నిరుపేదల కోసం ఇందిరమ్మ ఇండ్లు కట్టించి లబ్ధిదారులకు ఇవ్వకుండా గత ప్రభుత్వం జాప్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే నిరుపేదలకు రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గతంలో లక్కీడ్రా పద్దతిలో ఎంపికచేసిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపు అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. గత ప్రభుత్వ పాపాలు నాయకుల స్వార్థం ఫలితంగా ఇండ్లు కేటాయించినప్పటికీ లబ్ధిదారులకు అప్పగించలేదన్నారు. కేవలం గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కమీషన్ల కోసమే నిర్మాణాలు చేపట్టారని, ప్రయాణీకులకు అందుబాటులో లేకుండా బస్టాండ్ నిర్మాణం చేపట్టి వృధాగా వదిలేసినట్లు తెలిపారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ బస్టాండ్‌ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ ప్రభుత్వానికి సహకరించనప్పటికీ ప్రభుత్వ అనుమతితో పెండింగ్‌లో ఉన్న 800లకు పైగా కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, ఏఎంసి డైరెక్టర్లు కరుణాకర్‌రెడ్డి, నర్సింహా రెడ్డి, అక్కారం యాదగిరి, జిల్లా మైనార్టీ మాజీ అధ్యక్షుడు సమీర్, సుభాష్‌చంద్రబోస్, సుఖేందర్ రెడ్డి, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, జంగం రమేష్‌గౌడ్, మండల మైనార్టీ మాజీ అధ్యక్షుడు అజ్గర్, మన్నె అరుణ్‌కుమార్, సబ్బని నరేష్, చెప్యాల శేఖర్, సురేష్, ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.


సిసి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సా రెడ్డి

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**ధూళిమిట్ట, మే 7, ప్రభాతవార్త :** మండలంలోని బైరాన్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ బర్మ రాజమల్లయ్య తల్లి బర్మ కొమురమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం రోజున వారి కుటుంబ సభ్యులతో పాటు ఇటీవల పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ఇర్ఫాన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో ధూళిమిట్ట, మద్దూరు బిఆర్ఎస్ పార్టీ మండలాల అధ్యక్షులు మంద యాదగిరి, మేక సంతోష్, నాయకులు వెంకట్‌గౌడ్, సాగర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## నూతన వధువుకు పుస్తెలు, మెట్టెలు అందజేత

**సిద్దిపేట అర్బన్, మే 7, ప్రభాతవార్త :** చిన్నకోడూరు మండలం మల్లారం గ్రామానికి చెందిన నిరుపేద నూతన వధువు వివాహా నిమిత్తం బుధవారం సిద్దిపేట మున్సిపల్ 38వ వార్డు కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం, మాజీ కౌన్సిలర్ ధర్మవరం స్వప్న చేతుల మీదుగా పుస్తెలు, మెట్టెలు, గాజులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలోనే జీవితంలో నిజమైనా తృప్తి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దుల సంతు,పొన్నాల నగేష్, కిషన్ తదితరులు ఉన్నారు.

## పిహెచ్‌డి పట్టా పొందిన కలీమొద్దీన్

**గజ్వేల్, మే 7 (ప్రభాతవార్త):** ఉస్మానియా యూనివర్సిటీ నుండి కామర్స్ విభాగంలో గజ్వేల్ పట్టణానికి చెందిన ఎండి.కలీమొద్దీన్ పిహెచ్‌డి పట్టా పొందారు. కామర్స్ డాపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో జ్ఞానం వైఖరి మరియు భారీ వ్యర్థాల నిర్వహణ వైపు గృహాల ప్రవర్తనను అంచనా వేయడం అనే అంశంపై పరిశోధన చేసి పిహెచ్‌డి పట్టా పొందారు. కలీమొద్దీన్ పిహెచ్‌డి పట్టాపొందిన సందర్భంగా కుటుంబ సభ్యులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

## కొమ్ము నర్సయ్యకు దళితరత్న అవార్డు


దళిత రత్న అవార్డు అందుకుంటున్న కొమ్ము నర్సయ్య

**కొండపాక, మే 7, ప్రభాతవార్త :** సామాజిక ఉద్యమాలు చేసి వివిధ రకాలుగా ప్రజలను చైతన్యపరిచిన వ్యక్తులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి యేట గౌరవ ప్రదంగా అందించే దళిత రత్న అవార్డును కొండపాక మండల కేంద్రానికి చెందిన కొమ్ము నర్సయ్యకు బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అవార్డుగ్రహిత కొమ్ము నర్సయ్య మాట్లాడుతూ నా యొక్క సామాజిక ఉద్యమ నేపద్యాన్ని గుర్తించి నాకు ఈ అవార్డును ప్రకటించి ప్రధానం చేయడం గర్వంగా ఉందన్నారు. ఈ అవార్డుతో నా సామాజిక బాధ్యత మరింత పెరిగిందన్నారు. అట్టడుగు వర్గాలను మరింత చైతన్యం చేస్తానని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము విజయ్‌కుమార్, విశ్రాంత హెచ్ఎం ఏర్పుల రామకృష్ణ, ఉపాధ్యాయులు కొరబోయిన కనకయ్య, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు వద్దకొండ రవీందర్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మంగమ్మకు గణితంలో పిహెచ్‌డి

**పటాన్‌చెరు, మే 7,ప్రభాతవార్త:** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్,గణితశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని సీహెచ్.మంగమ్మ డాక్టరేట్ కు అర్హత సాధించారు. నిలువు పోరస్ ప్లేట్ అంతటా మాగ్నెటో హైడ్రోడైనమిక్ ద్రవ ప్రవాహం యొక్క వేడి, ద్రవ్యరాశి బదిలీ ప్రభావం అనే అంశంపై ఆమె అద్భుతమైన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాల సిద్దులు మల్ల బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ మంగమ్మ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పిహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు

## భారత సైన్యానికి సెల్యూట్ : వెంకటేష్

**కొండాపూర్, మే 7,ప్రభాతవార్త:** ఆపరేషన్ సింధూర్‌తో పౌర సమాజానికి ఇబ్బందులు లేకుండా పాకిస్తాన్‌కు ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారత్ త్రివిధ దళాలు ఉగ్రవాదుల పైనే దాడులు చేసి సరైనా రీతిలో బుద్ది చెప్పిందని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు తూర్పు.వెంకటేశం అన్నారు. బుధవారం బీజేపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు తూర్పు. వెంకటేశం మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ పేరు తో జైషే మహమ్మద్ తీవ్ర వాదులకు సరైన బుద్ది చెప్పిందని ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

## పంట మార్పిడి పద్దతి పాటించండి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రాధిక

**గజ్వేల్, మే 7 (ప్రభాతవార్త):** రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా బుధవారం గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్, ఏరువాక కేంద్రం తోర్నాల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్వేత, సతీష్ పాల్గొని రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి రాధిక మాట్లాడుతూ పంట మార్పిడి పద్దతిని రైతులు అవలంబిస్తే అధిక లాభాలు పొందవచ్చున్నారు. ఒకే భూమిలో ఒకే రకం పంటను ప్రతిసారి వేయడం వల్ల భూమిలో పంటలు ఎదిగే శక్తి కోల్పోతుందని పేర్కొన్నారు. అలాగే రైతులు పంటలు వేసే ముందు భూసార పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి, ఏడిఏ బాబునాయక్, వ్యవసాయాధికారి నాగరాజు, పిఏసిఎస్ మాజీ చైర్మన్ వెంకటనర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అక్కారం యాదగిరి, కరుణాకర్‌రెడ్డి, నర్సింహా రెడ్డి, దాతర్‌పల్లి మాజీ సర్పంచ్ లక్ష్మణ్, గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, మండల మైనార్టీ అధ్యక్షుడు అజ్గర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, జంగం రమేష్‌గౌడ్, బాబు రావు, ఆత్మ కమిటీ డైరెక్టర్ క్యాసారం బాబా, మామిడి కృష్ణ, మన్నె అరుణ్ కుమార్, శ్రావణ్‌కుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

**జగదేవ్‌పూర్, మే 7 (ప్రభాతవార్త):** పేదింటి ఆడపడుచుల వివాహాలకు కళ్యాణలక్ష్మి పథకం అండగా నిలుస్తుందని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. జగదేవ్‌పూర్‌లోని రైతువేదికలో మండలానికి మంజూరైన కళ్యాణలక్ష్మి పథకం లబ్ధిదారులకు బుధవారం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు లక్షా 116 నుండి లక్షా 50వేలకు పెంచి ఇవ్వాలన్నారు. మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సా రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా పాలనలో పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కేశిరెడ్డి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ నిర్మల, ఉప తహసీల్దార్ రఘువీరారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బత్తుల మల్లేశంయాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, నర్సింహారెడ్డి, హరినాథ్, పానుగంటి రాజు, కొండయ్య, వెంకట్రాం రెడ్డి, అమరేందర్‌రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.




వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

## మామిడిపల్లిలో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు

**కంది, మే 7, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో బుధవారం రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగబడులు సాధించడం తథ్యమని అధికారులు పేర్కొన్నారు. తక్కువ యూరియా విని యోగంతో సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. దుకాణంలో కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు సంబంధించిన రశీదులను భద్రపర్చుకోవాల న్నారు. పంట మార్పిడిని పాటించాలని, సుస్థిర ఆదాయాన్ని పొందాల న్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ సభ్యులు రాములు నాయక్, జోగిపేట వ్యవసాయ పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్పందన, శాస్త్రవేత్తలు డాక్టర్ కిషన్,సత్యనారాయణ, కంది అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మనోజ్‌కుమార్, ఏడిఎ కెవి లక్ష్మి, మండల వ్యవసాయ అధికారి ఎ శ్రీనివాస్ గౌడ్, ఎఎంసి చైర్మన్ రాంచందర్ నాయక్, మాజీ సర్పంచ్ రాములు, బిటిఎం బీనా, రైతులు, విద్యార్థులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## మండలంలో కొనసాగుతున్న ఫార్మర్ ఐడి రిజిస్ట్రేషన్



ఫార్మర్ ఐడిపై అవగాహన కల్పిస్తున్న ఏడిఎ నూతన్‌కుమార్

**కంగ్టి, మే 7,ప్రభాతవార్త:** అన్నదాతలకు 11 నెంబర్లతో కూడిన యూని కోడ్‌ని కేటాయించేందుకు మండలంలో రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోందని వ్యవసాయ సంచాలకులు కె.నూతన్‌కుమార్ అన్నారు. బుధవారం వ్యవసాయ విస్తీర్ణ అధికారి స్వాతితో కలిసి రైతులకు ఫార్మర్ ఐడిపై అవగాహన కల్పించారు. వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు భూములకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారంతో ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తారు. రెవెన్యూ శాఖ ద్వార సేకరించిన భూ యాజమాన్య వివరా లను రైతు ఆధార్ సంఖ్యను అనుసంధానం చేసి ఈ ఫార్మర్ ఐడి కార్డును కేటాయించనున్నారు. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్న రైతులకే రానున్న పిఎం కిసాన్ లబ్దిదారులు లబ్దిపొందగలుగుతారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, రుణమాఫీ లాంటి పథకాలకు ఈ ఫార్మర్ రిజిస్ట్రీకి ఎలాంటి సంబంధం ఉండదు. ఫార్మర్ ఐడిని పొందుటకు రైతులు తమ ఆధార్‌కార్డును, భూ యాజమాన్య పాస్‌పుస్తకం, ఆధార్ కార్డుకు లింకు ఉన్న సెల్ నంబర్‌ను తీసుకుని వ్యవసాయ విస్తీర్ణ అధికారిని సంప్రదించి ఫార్మర్ ఐడీకి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని నూతన్‌కుమార్ పేర్కొన్నారు.

## కేతకి ఆలయాన్ని దర్శించుకున్న ఎస్‌పి దంపతులు



ఎస్‌పి పరితోష్ దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

**ఝరాసంగం, మే 7, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో పార్వతీదేవి సమేతంగా కొలువున్న శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం జిల్లా ఎస్‌పి పరితోష్‌పంకజ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఎస్‌పి కుటుంబ సభ్యులను అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారికి అభిషేకం, అమృతగుండంలో ప్రత్యేక పూజలు అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ఎస్‌పి కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఎస్‌పి కుటుంబ సభ్యులను అర్చకులు ఆశీర్వచనాలు చేసి శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఈఓ శివరుద్రప్ప, డిఎస్‌పి రామోహ్మన్‌రెడ్డి, జహీరాబాద్ రూరల్ సిఐ జక్కుల హనుమంతు, ఎస్ఐ నరేష్,ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కనుల పండువగా వాసవీమాత జయంతి వేడుకలు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో జయంతి వేడుకల్లో చింత ప్రభాకర్

**సదాశివపేట, మే 7, ప్రభాతవార్త:** పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆల యంలో బుధవారం వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జయంతి వేడుకలకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు కనులపండువగా నిర్వహించారు. 150 మంది మహిళలు నిండు కలశాలతో ఆలయానికి ఊరేగింపుగా చేసుకుని అమ్మవారికి సమ ర్పించి మంగళహారతులు ఇచ్చి పూజలు నిర్వహించి డోలారోహణం చేశారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను ఆర్యవైశ్య సంఘం యువజన విభాగం, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందచేశారు. కార్య క్రమంలో బిఆర్ఎస్‌నాయకులు శివరాజ్, సిడిసి మాజీచైర్మన్ కాసాల బుచ్చి రెడ్డి, మాజీ మున్సిపల్ పాలక వర్గ సభ్యులు అంజయ్య, శివరాజ్ పాటిల్, చింత సాయినాథ్, చింత గోపాల్, బుచ్చిరెడ్డి, వీరేశం, నాగేష్, ప్రకాశం, అశోక్, రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాధాకృష్ణ, మహిళా సంఘం అధ్యక్షురాలు పురం రజిని, మహిళలు, తదితరులు అర్చకులు జ్యోతి పంతులు వేద మంత్రాలు వల్లిస్తుండగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## ఆపరేషన్ సింధూర్ సక్సెస్‌పై బిజెపి హర్షం

**సిర్గాపూర్, మే 7, ప్రభాతవార్త:** కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతి రూపకంగా భారతదేశం ఎత్తుగడలను పాకిస్తాన్ ఆలోచించుకునేలోగానే సింధూర్ ఆపరేషన్ చేయడం హర్షణీయమని బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర ఇసి సభ్యులు అరుణ్‌రాజ్‌శేరికార్ అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల స్థావరా లపై దాడులు నిర్వహించి 100 మందికిపైగా ఉగ్రవాదులను కానరానిలోకా లకు చేర్చిన భారత సైన్యం సహసాన్ని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వానికి 140 కోట్ల మంది రుణపడి ఉంటారని అరుణ్‌రాజ్ శేరికార్ కొనియాడారు.

## ఉపాధి పనులను పరిశీలించిన ఎంపిడిఓ

**కంగ్టి, మే 7, ప్రభాతవార్త:** మండలపరిధిలోని గాజులపాడ్‌లో కొనసాగు తున్న ఉపాధి హామీ పనులను మండల అభివృద్ధి అధికారి సత్తయ్య, ఉపాధి ఏపిఓ నర్సింలు పరిశీలించారు. గ్రామంలో 250 మంది ఉపాధి కూలీలు పనులు చేపడుతున్నట్లు అధికారులు సత్తయ్య, నర్సిములు పేర్కొ న్నారు. గ్రామానికి చెందిన బలిరాంకు చెందిన పొలంలోని రాళ్లను ఏరి కట్టలుకట్టడం పనులు చేపడుతున్నారన్నారు. నిబంధనల ప్రకారం పనులు చేపడితే రోజుకు 307 రూపాయల కూలీ దొరుకుతుందన్నారు. ఇదిలా ఉండగా హోబా తండాను సందర్శించి తండాలోని నర్సరీని తనిఖీ చేశారు.

# అధ్వానం కానుకుంట రోడ్డు

### ఎమ్మెల్యే జిఎంఆర్ సొంత నిధులతో
### ప్రారంభించినా పూర్తికాని నిర్మాణ పనులు
### ప్రమాదాల బారినపడుతున్న వాహనదారులు



గుంతలలుగాఉన్న కానుకుంట రోడ్డు

**గుమ్మడిదల మే 7 (ప్రభాతవార్త):** మండల పరిధి లోని కానుకుంట రోడ్డు సమస్య సంవత్సరాల తర బడి కొనసాగుతూనే వస్తుంది. మండల పరిధిలోని అనంతారం కానుకుంట ఇతరమండలాల్లోని గ్రామాలు జిల్లాలకు అనుబంధంగా ఉండడం.. నిత్యం ఈ రోడ్డు మార్గాన వందల సంఖ్యలో వాహనదారులు ప్రయాణిస్తూ ఉంటారు. ఎనిమిది కిలోమీటర్ల మార్గాన ఉన్న ఈ రోడ్డు కేవలం 12 ఫీట్ల విస్తీర్ణం ఉండడం, అడుగడుగునా గుంతలు ఉండడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. కాగా ఈ రోడ్డు విస్తీర్ణ పెంచాలని కోరుతూ కానుకుంట గ్రామ ప్రజలు కొన్ని సంవత్సరాలుగా అధికారులు,ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూ.. రోడ్డు సమస్యలను వివరిస్తూ వస్తున్నారు. అయినప్పటికీ సమస్య మాత్రం పరి ష్కారం కాలేదు. గత సంవత్సరం ప్రభుత్వం నుంచి మంజూరైన కోటి 50 లక్షల రూపాయలతో పాటు.. శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి ఏడు కోట్ల 50 లక్షల సొంత నిధులతో 2023 మార్చ్ 27వ తారీఖున శంకుస్థాపన చేశారు. పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసు కోవాలని అప్పటి సమావేశంలో అధికారులను ఆదే శించారు. దీంతో రోడ్డు బాగుపడుతుందని ప్రజలు సంతోషించారు. అయినప్పటికీ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సొంత నిధులతో పనులను ప్రారం భించిన.. నేటికి ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాలేదు. ముందు ఉన్నదానికన్నా పూర్తి అధ్వాన స్థితికి రోడ్డు పరిస్థితి చేరుకుంది. అడుగడుగునా గుంతల ఉండడం.. రోడ్డు నిర్మాణం కోసం వేసిన కంకర మట్టి పనులు మధ్యలోనే ఆగిపోవడం ప్రయాణించే ప్రయాణికులకు నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా వర్షాలకు నిండిన నీళ్లతో ఎక్కడ ఏ గుంత ఉందో తెలియని పరిస్థితి ఏర్పడుతుంది. కాగా ఈరోడ్డుపై ప్రయాణించాలంటే ప్రయాణికులు గజగజ వనకాల్సిన పరిస్థితి నెలకొంటుంది. మండ లంలో అధిక సంఖ్యలో రైతుల ఉండడం వ్యవ సాయ భూములు ఈ దారిలోనే ఎక్కువ ఉండడం నిత్యం ఈ రోడ్డు మార్గాన రైతులు కూడా అధిక సంఖ్యలో ప్రయాణిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో భారీస్థాయిలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే ఈ పరిస్థితిని స్థానిక అధికారులకు ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్న పరిష్కారం చూప డం లేదని ఈ మార్గాన ప్రయాణించే ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.



పంటల సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

## విత్తన కొలుగోలులో జాగ్రత్తలు పాటించాలి

**నర్సాపూర్, మే 7, ప్రభాతవార్త:** విత్తనాలు కొనుగోలు సమయంలో జాగ్ర త్తలు పాటించాలని వ్యవసాయశాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. బుధవారం నర్సాపూర్ మండల పరిధిలోని తుల్జారాంపేట్, నారాయణపూర్ గ్రామాలలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు అన్నదాతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువులతోనే పంటలు పండించుకోవాలన్నారు. అలాగే రసాయనిక ఎరువులు యూరియా మోతాదుకు మించి వాడకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు అమీర్ భాష, అపపా జహన్, సుశీల, రాధిక, ఏవో దీపిక, ఏఈఓలు రవివర్మ, దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ప్రజా ప్రతినిధులు బాబ్యా నాయక్, సామ్యానాయక్, రెడ్యానాయక్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, మహిళలు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సాగు ఖర్చుల తగ్గింపుతో ఆదాయం మెరుగు

**చౌటకూరు, మే 7, ప్రభాతవార్త:** పంటల సాగులో రసాయన ఎరువుల విని యోగం తగ్గించుకుంటే ఖర్చులు తగ్గుతాయని, ఫలితంగా ఆదాయం మెరుగ పడుతుందని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. రాజేందర్ నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, న్యాల్‌కల్ మండలంలోని బసంత్‌పూర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బస్వాపూర్‌లో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ జూన్ 13వ తేదీవరకు 1200 గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ సాగుల యూరియా, రసాయన ఎరు వుల వినియోగం తగ్గించుకోవాలని, చీడపీడల నివారణ సాధ్యమవుతుందని, ఫలితంగా సాగు ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. జోగిపేట ఏడిఎ రమాదేవి మాట్లాడుతూ చెట్లను పెంచుకోవడంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గణపతి షుగర్స్ పరిశ్రమ జనరల్ మేనేజర్ కృష్ణమోహన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ డాక్టర్ తబ్బసుమ్ ఫాతిమా, వ్యవసాయ శాస్త్రవేత్తలు పి రమేష్, ఎన్‌హరి, మండల వ్యవసాయ అధికారి చైతన్య, ఏఈఓ వంశీ, రైతులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్ పట్ల హర్షం



సంబురాలు జరుపుకుంటున్న బిజెపి నాయకులు

**చిన్నశంకరంపేట, మే 7,ప్రభాతవార్త:** పహల్గాం ఘటనకు ప్రతీకార చర్యగా ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం పట్ల మండల బిజెపి నాయకులు చిన్నశంకరంపేట పట్టణంలో బుధవారం హర్షం వ్యక్తం చేస్తూ విజయోత్సవ సంబురాలను జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ మన భారత ఆర్మీ పట్ల గర్వంగా ఉందని అన్నారు. జై హింద్ అంటూ నినాదాలు చేస్తూ సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో బిజెపి పార్టీ మండలాధ్యక్షుడు రాజు, జిల్లా నాయకులు మల్లారెడ్డి, దశరథం తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కుల అందజేత

**చిన్నశంకరంపేట, మే 7,ప్రభాతవార్త:** మండల పరిధి శాలిపేట గ్రామానికి చెందిన తులసి అనారోగ్యంతో బాధపడుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకొగా చెక్కు మంజూరైంది. బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాన సత్యనారాయణ, ఆవుల గోపాల్‌రెడ్డిలు 60వేల రుపాయల చెక్కును బాధిత కుటుంబసభ్యులకు అందించారు. అలాగే మండలంలో 11 మంది 4లక్షల రుపాయల సహాయనిధి చెక్కులను అందించినట్లు వారు తెలిపారు.

## ఘనంగా భరోసా ఏర్పాటు దినోత్సవం

**మెదక్ అర్బన్, మే 7, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా ఏర్పాటు చేసిన వినూత్న కార్యక్రమం భరోసా ఏర్పాటు దినోత్సవాన్ని బుధ వారం స్థానిక భరోసా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరోసా కేంద్రం భాదితుల రక్షణ, మద్దతు సాధికారిత దిశగా కృషి చేస్తుందన్నారు. ఈ కేంద్రం ద్వారా మద్దతు పొందిన వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 250 పైగా బాధితులను మానసిక, సామాజిక, చట్టపరమైన మద్దతు అందించి వారికి న్యాయ సహాయం, ఆశ్రయం పునరావాసం కల్పించడం జాతిగిందన్నారు. అంతే కాకుండా 150 పైగా మంది భాదితులకు సుమారు రూ. 67.74 లక్షల నష్ట పరిహారం అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భరోసా కేంద్రం నిర్వాహకులు, భాదితులు తదితరులు పాల్గొన్నారు.



భరోసా దినోత్సవం లో భాగంగా కేక్ కట్ చేస్తున్న అదనపు ఎస్పి



అమ్మవారి సహస్ర పారాయణం చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

## భక్తిశ్రద్ధలతో శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

**నర్సాపూర్, మే 7, ప్రభాతవార్త:** పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యం లో నూతనంగా నిర్మించిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఈ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా బుధవారం పూజారి ఆధ్వర్యంలో గోపూజ, గణపతి పూజ, పుణ్యావచనం, ధ్వజారోహణం, పంచగవ్య ప్రాశన, దీక్షాధారణ, అఖండ దీపస్థాపన, సర్వతీభద్ర వాస్తో నవగ్రహ యోగినీ క్షేత్రపాలక యాగ శాల ప్రవేశం, స్థాపిత దేవతాహనం, జలాధివాసం, నీరాజనం మంత్రపుష్పం వంటి పూజా కార్యక్రమా లు భక్తిశ్రద్ధలతో నియమనిష్టలతో నిర్వహించారు. అంతేగాక ఆర్యవైశ్య సంఘం మహిళ సభ్యులచే సహస్ర పారాయణం చేయడం జరిగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు, ఈ మేరకు ఈ నెల 9న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇమ్మడి శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి మల్లేశం గుప్త, కోశాధికారి హరీష్ గుప్తా, జిల్లా అధ్యక్షులు బి శ్రీనివాస్ గుప్తా లతోపాటు ఆర్యవైశ్య సంఘం సభ్యులు జ్ఞానేశ్వర్ గుప్తా, ప్రభు శంకర్ గుప్తా, ప్రవీణ్ గుప్తా, నాగరాజు గుప్తా, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు గుర్తింపు కార్డులను సద్వినియోగం చేసుకోండి

**నాగల్‌గిద్ద, మే 7, ప్రభాతవార్త:** రైతులు గుర్తింపు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌చారి సూచించారు. బుధవారం మండల పరిధిలోని ముక్తాపూర్‌లో ఏఈఓ వినయ్ చౌహన్ చేపడుతున్న ఫార్మర్ ఐడి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఏఓ ప్రవీణ్ చారి పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. 11 నంబర్‌లతో కూడిన ఫార్మర్ ఐడిని కేటాయిస్తారని, ఐడిలో తన వ్యవసాయ భూములకు సంబంధించి వివరాలు ఉంటాయన్నారు. రైతులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు



వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

**నర్సాపూర్, మే 7, ప్రభాతవార్త:** మెదక్ హైవేరోడ్డులోగల పెద్దచింతకుంట గ్రామ శివారులోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శ్రీ విశ్వవసునామ సంవత్సర వైశాఖ శుద్ధ దశమి రోజున జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ సమాధి అయిన పవిత్ర దినం సందర్భంగా శ్రీ వీర బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కి ప్రత్యేక పూజలు అర్చన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నియమనిష్టలతో ఎంతో వైభవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృపాచారి, నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు నరేందర్ చారి, సీనియర్ సభ్యులు శ్రీరాములు చారి, లింగం చారి, సదానంద్ చారి భాస్కర్ చారి, షణ్ముఖ చారి, బిక్షపతి చారి, గోమారం బిక్షపతి చారి, సతీష్ చారి, ప్రవీణ్ చారి, వెంకటేష్ చారి, బ్రహ్మం చారి, నాగరాజు చారి, అనిల్ చారి, శివ చారి, రామచంద్రయ్య చార్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడి కుటుంబానికి ఎన్ఆర్ఐ బాసట

**చిన్నశంకరంపేట, మే 7,ప్రభాతవార్త:**

మండల పరిధి బాగిర్తిపల్లి గ్రామానికి చెందిన కుమార్ ఇటీవల ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎన్ఆర్ఐ చంద్రశేఖర్ బుధవారం వారి కుటుంబానికి 5వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో శ్రీమన్, స్వామి, వెంకట్‌గౌడ్, స్వామి, మల్లేష్ పాల్గొన్నారు.

## భక్తిభావంతో ఆలయాల నిర్మాణం

**చిన్నశంకరంపేట,మే 7,ప్రభాతవార్త:** ఆలయాల నిర్మాణంతో భక్తి భావంచ ఆధ్యాత్మికత పెరుగుతుందని శ్రీశ్రీ సద్గురు సారేశ్వర స్వామి అన్నారు. బుధవారం మండల పరిధి గజగట్లపల్లి గ్రామంలోని గంగమ్మ గుడి నిర్మాణానికి సారేశ్వర స్వామి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో శాస్త్రోకంగా భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బండి గోపాలక్రిష్ణ, ప్రధాన కార్యదర్శులు నర్సింలు, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గంగమ్మ గుడికి భూమి పూజ చేస్తున్న దృశ్యం



నివాళులర్పిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

## చిరస్మరణీయుడు అల్లూరి సీతారామరాజు

### మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

**అమీన్‌పూర్, మే 7 ప్రభాతవార్త :** బ్రిగాష్ పాలకుల అకృత్యాలకు వ్యతి రేకంగా పోరాడిన విప్లవ యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు చిరస్మనీయుడని మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోనీ ఎన్ఎస్ఎల్ కాలనీలో అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ కొల్లూరి మల్లేశ్ , యూసఫ్, సాధువు మల్లేష్, జగదీష్, కో ఆప్షన్ సభ్యులు తలారి రాములు,కొల్లూరి యాదగిరి,కాలనీ సభ్యులు రామరాజు, సుబ్బ రాజు, దుర్గరాజు వర్మ, శ్రీనివాస్‌రాజు, జానకిరామరాజు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి రూ. లక్ష 11 వేలు విరాళం




విరాళం అందజేస్తున్న పత్తిపాటి మాధవ్

**అమీన్‌పూర్, మే 7 ప్రభాతవార్త :** పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి పత్తిపాటి మాధవ్ రూ. 1,11,999 విరాళంగా బుధవారం అందజేశారు. ఇంద్రేశం గ్రామం ఆరతినగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి న్యాయవాదులు, బిఆర్ఎస్ నాయకులు సింగారం ఓంప్రకాష్, రాంప్రకాష్ ముఖ్య అతిథులుగా విచ్చేసి పత్తిపాటి మాధవ్‌తో కలిసి రూ. 1,11,999 ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఓం ప్రకాష్ మాట్లాడుతూ నూతన ఆలయ నిర్మాణానికి పత్తిపాటి మాధవ్ విరాళం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం చలివేంద్రంలో ఏర్పాటు చేసిన మజ్జిగ,పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఉమాపతి, బిఆర్ఎస్ నాయకుడు నర్సింగ్‌రావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ దీక్షాపరులకు అన్నదానం

**అమీన్‌పూర్, మే 7 ప్రభాతవార్త :** శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ ధర్మకర్త మహిపాల్‌రెడ్డి స్వామి ఆధ్వర్యంలో బీరంగూడ గుట్టపై హనుమాన్ దీక్షాపరులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆంజ నేయస్వామికి మహిపాల్‌రెడ్డి నైవేద్యం సమర్పించారు. జై శ్రీరాం, హను మాన్ నామస్మరణలతో బీరంగూడ గుట్ట ప్రాంగణమంతా మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్‌యాదవ్,ఆలయ ధర్మకర్తలు చంద్రశేఖర్, లక్ష్మీకాంతరావు, భూపాల్ రెడ్డి, రుతుపవన్ రెడ్డి, సంపత్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్, లింగమయ్య, సమ్మయ్య ఉన్నారు.

## పంటల వివరాలపై తహసీల్దార్ సమీక్ష



మాట్లాడుతున్న తహసీల్దార్ రజనికుమారి

**రామాయంపేట, మున్సిపాలిటీ, మే 7, ప్రభాతవార్త :** తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ, నీటిపారుదల, వ్యవసాయ శాఖ అధి కారులతో తహసీల్దార్ రజనీకుమారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా వేసిన పంట వివరాలను అడిగి తెలుసు కున్నారు. వివిధ గ్రామాల్లో గ్రామాల వారీగా పంటల వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ, మండల ప్లానింగ్ అధికారి పి. కవిత తదితరులు పాల్గొన్నారు.

## నేడు వెంకటాపూర్(ఆర్)లో మెగా వైద్యశిబిరం

**రామాయంపేట, మే 7, ప్రభాతవార్త :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వ్యవస్థాపకులు జీన్ హెన్రీ డునెంట్ జయంతిని పురస్కరించుకుని గురు వారం రామాయంపేట మండలం వెంకటాపూర్(ఆర్)లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్య దర్శి సుభాష్‌చంద్రబోస్, కోశాధికారి డి.జి.శ్రీనివాసశర్మ తెలిపారు. ఇండి యన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెదక్ శాఖ పక్షాన గ్రామంలోనీ గ్రామపంచాయతీ భవనంలో ఉదయం 9:30 గంటల నుండి 1.30 గంటల వరకు మల్లారెడ్డి హాస్పిటల్స్ సూరారం వారి సౌజన్యంతో మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ సదవకాశాన్ని గ్రామస్తులు ఉపయోగించుకోవాలని వారు కోరారు.

## రైతు నమోదు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో రైతులు పాల్గొనాలి

**నిజాంపేట, మే 7, ప్రభాతవార్త :** రైతు నమోదు ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పైలెట్ కార్యక్రమంలో రైతులు తప్పనిసరిగా పాల్గొని వివరాలను అందజేయాలని మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి కోరారు. ఈసందర్భంగా మంగళవారం రైతు వేదికలో ఆయన మాట్లాడుతూ ఈపథకంలో భాగంగా ప్రతి ఒక్క రైతుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ సంఖ్య అనగా 14 నంబర్లతో గల విశిష్ట సంఖ్య కేటాయించడం జరుగుతుందని,తద్వారా రైతులకు అవసర మైన పథకాలకు ఉపయోగరం అవుతుందని తెలిపారు. ప్రతి ఒక్క రైతు ఆధార్ కార్డు,పట్టా పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ లింక్ కలిగిన మొబైల్ ను సమీప వ్యవసాయ విస్తరణ అధికారులకు వద్దకు తీసుకువెళ్లి నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారిని రమ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న సిద్దేశ్వరానందగిరి మహారాజ్

**పాపన్నపేట, మే 7, ప్రభాతవార్త :** ఏడుపాయల వనదుర్గామాతను సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్ర మం సిద్దేశ్వరానందగిరి మహారాజ్ బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. మహారాజ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, అర్చకులు శంకర్ శర్మ, రాము శర్మ, తదితరులున్నారు.

## ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన

**న్యాల్‌కల్, మే 7, ప్రభాతవార్త:** ఆన్‌లైన్ మోసాలపై బుధవారం న్యాల్‌కల్‌లో ఎస్ఐ చల్లా రాజశేఖర్ ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని మడివాళప్ప మాచిదేవ్‌చౌక్‌వద్ద ప్రజలకు ఎస్ఐ పలు సూచనలు, జాగ్రత్తలు వివరించారు. సెల్ ఫోన్‌లో అపరిచితుల నుంచి వచ్చే లింకులకు ఓపెన్ చేయవద్దని, అపరిచితులకు వ్యక్తిగత వివరాలు తెలుపవద్దన్నారు. కార్యక్రమంలో హద్నూర్ పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**చిన్నశంకరంపేట, మే 7,ప్రభాతవార్త:** మండల పరిధిలోని జంగరాయి గ్రామానికి చెందిన చౌటకూరి బాలమణి ఇటీవల మృతి చెందింది. విష యం తెలుసుకున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వారి కుటుంబానికి రూ. 5వేల ఆర్థిక సహాయం పంపగా బిఆర్ఎస్ నాయకులు బందెల ప్రభాకర్ బుధవారం అందించారు. కార్యక్రమంలో సురేష్, శ్యామ్, సిద్దిరాములు, మోతీరాం, నగేష్, సుధాకర్ పాల్గొన్నారు.